
- వైసీపీ ఇన్‌చార్జిలుగా సురేష్, నాగార్జున పరిచయ సభలు వెలవెల
- బాలినేని, మాగుంట గైర్హాజరు.. వారి అనుచరులూ దూరం
- రెండు సమావేశాల్లోనూ ఎంపీ పేరు ఉచ్ఛరించని నాయకులు
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్‌ను హెచ్చరించిన సాయిరెడ్డి
- జగన్ షరతు సబబే అని కితాబు
- బాలినేని, మాగుంట ఉంటేనే ప్రభంజనం అంటూ జంకె వ్యాఖ్యలు
- వాసును కలిసిన చెవిరెడ్డి
- మహీధర్‌రెడ్డికి హ్యాండిచ్చిన జగన్
- సీఎంను కలిసిన వ్యాపారి రవిశంకర్



సంతనూతలపాడు సమావేశంలో విజయసాయిరెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ముదిరిన ముసలం



వైసీపీలో ముసలం ముదిరింది. కొండపి, సంతనూతలపాడు ఇన్‌చార్జిలుగా నియమితులైన రాష్ట్రమంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున పరిచయ కార్యక్రమాలు వెలవెలబోయాయి. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితోపాటు వారి అనుచరగణమంతా సమావేశాలకు గైర్హాజరైంది. కొండపి సమావేశానికి ఆ నియోజకవర్గంలో ముఖ్యనాయకుడైన డాక్టర్ వెంకయ్య, సంతనూతలపాడు సమావేశానికి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కూడా హాజరుకాలేదు. దీంతో ఆ రెండు నియోజకవర్గాలతోపాటు ఉమ్మడి జిల్లా వైసీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయన్న విషయం స్పష్టమైంది. పైగా రెండు సమావేశాల్లోనూ నాయకులు ఎంపీ మాగుంట పేరును ఒక్కసారి కూడా ఉచ్ఛరించకపోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు ఒంగోలు లోక్‌సభ స్థానంపై దృష్టిసారించిన సీనియర్ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైదరాబాద్‌లో బాలినేనినితో భేటీ అయ్యారు. ఒంగోలులో మాగుంటను ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ఆయన అనుచరులు పెద్దసంఖ్యలో వచ్చి కలిశారు. ఇదే సమయంలో సీనియర్ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని తప్పించి బొట్ల రామారావు అనే బీసీ నాయకుడికి కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని కేటాయిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఒంగోలుకు చెందిన వ్యాపారి రవిశంకర్ కూడా సీఎంను కలవడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఎంపీ విజయసాయిరెడ్డిని పంపి కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల కార్యకర్తల సమావేశాలను శుక్రవారం నిర్వహించింది. ప్రధానంగా ఆ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు, కాబోయే అభ్యర్థులైన మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జునలను పరిచయం చేసేందుకు నిర్వహించిన కార్యక్రమాలు వెలవెలబోయాయి. సంతనూతలపాడు సమావేశంలో అయితే ఆరంభం నుంచి చివరి దాకా వేసిన కుర్చీలలో సగం ఖాళీగా కనిపించాయి. కొండపి సమావేశానికి కొంతమంది నాయకులు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడం కనిపించింది. సమావేశాల్లో నాయకులు మాట్లాడేటప్పుడు ప్రశ్నలు వేసినా, నిరసనలు తెలిపినా ఇబ్బందిపడతారంటూ కిందిస్థాయిలోని ముఖ్య నాయకులందరికీ పోలీసులు హెచ్చరికలు పంపటంతోపాటు రెండు సమావేశాలు జరిగిన ప్రాంతంలో ఎక్కువమంది పోలీసులతో బందోబస్తు కూడా ఏర్పాటుచేశారు.

కొండపిలో ముఖ్యులు దూరం

ఒంగోలు లోక్‌సభ పరిధిలోని కొండపి సమావేశానికి ముందుగా చెప్పినట్లే ఎంపీ మాగుంట గైర్హాజరయ్యారు. ఒంగోలులో ఉండి కూడా వెళ్లలేదు. ఇంకోవైపు మాజీమంత్రి బాలినేని అనుచరులు సమావేశం వైపు కన్నెత్తిచూడలేదు. సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ వెంకయ్య, ఆయన అనుచరులు కూడా గైర్హాజరయ్యారు. నియోజకవర్గంలోని గ్రామస్థాయి నాయకులైతే చాలామంది ఆ సమావేశం వైపు రాలేదు. బాలినేని అనుచరులుగా ఉన్న టంగుటూరు మండల నాయకులు కానీ, కొండపి ఏఎంసీ చైర్మన్, ఆమె భర్త, కొండపి ఎంపీపీ, అలాగే 12కి పైగా గ్రామాలకు సంబంధించిన సర్పంచ్‌లు, వారి భర్తలు కూడా దూరంగా ఉన్నారు. జరుగుమల్లి ఎంపీపీ భర్త అయిన మాగుంట అనుచరుడు బెల్లం సత్యంతోపాటు ఆ మండలానికి సంబంధించి ముఖ్యనాయకులు కూడా గైర్హాజరయ్యారు. పొన్నలూరు, మర్రిపూడి మండలాలకు సంబంధించి వచ్చిన నాయకుల్లో ఎక్కువమంది కొద్దిసేపు ఉండి వెళ్లిపోవడం కనిపించింది. సమావేశంలో మాట్లాడిన వారెవ్వరూ తమ ప్రసంగాల్లో ఇటు మాగుంట, అటు బాలినేని పేర్లను ప్రస్తావించలేదు. సమావేశాన్ని గంటన్నరలోనే ముగించేశారు.

ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై చర్య

సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు గైర్హాజరవడం క్రమశిక్షణా రాహిత్యమన్నారు. ఆయనపై అధిష్ఠానం చర్య తీసుకుంటుందని ప్రకటించారు. అయితే కొండపి సమావేశానికి గైర్హాజరైన మాగుంటను కానీ, రెండు సమావేశాలకు హాజరుకాని బాలినేని విషయాన్ని కానీ ఆయన ప్రస్తావించలేదు. పైగా ఇదే సమావేశంలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ బాలినేని మద్దతుతో తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాత్రం మాగుంట, బాలినేని ఇద్దరూ కలిస్తేనే ఉమ్మడి జిల్లాలో పార్టీకి ప్రభంజనం వస్తుందని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

గంటలోనే ముగిసిన సంతనూతలపాడు సమావేశం

ఒంగోలులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన సంతనూతలపాడు ఇన్‌చార్జి అయిన మేరుగ నాగార్జున పరిచయ కార్యక్రమ సభ గంటలోనే ముగిసింది. ఈ నియోజకవర్గం బాపట్ల లోక్‌సభ పరిధిలో ఉన్నందున మాగుంటను వదిలేసి బాలినేనినే ఆహ్వానించారు. ఆయన హాజరుకాలేదు. ఎన్‌జీ పాడు ఎంపీపీ భర్త ప్లేటు ఫిరాయించి సమావేశానికి వచ్చినా ఆ మండలం నుంచి కనీస స్థాయి నాయకులు ఒక్కరు కూడా హాజరుకాలేదు. ఆరంభం నుంచి బాలినేనితోనే ఉంటూ పార్టీకి కీలక నాయకుడుగా వ్యవహరిస్తున్న సంతనూతలపాడు జడ్పీటీసీ భర్త చెంచిరెడ్డి కూడా డుమ్మా కొట్టారు. మద్దిపాడు మండలం నుంచి అత్యధిక మంది నాయకులు, కార్యకర్తలు దూరంగా ఉన్నారు. గత ఏడాది నుంచి కమ్మ సామాజికవర్గానికి గుర్తింపు ఇవ్వడంలేదంటూ నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తున్న ఆవర్గానికి చెందిన వైసీపీలోని ముఖ్యనాయకులు మొత్తం గైర్హాజరయ్యారు. అందులో ఏఎంసీ చైర్మన్‌తోపాటు గత రెండు దశాబ్దాల నుంచి గ్రామ, మండల స్థాయిలో పెత్తనం చేస్తున్న నాయకులంతా ఉన్నారు. చీమకుర్తి మండలంలో బూచేపల్లి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న మారం వెంకారెడ్డి సమావేశానికి దూరంగా ఉన్నారు.

మహీధర్‌రెడ్డికి మొండిచేయి

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు శాసనసభ్యుడైన మానుగుంట మహీధర్‌రెడ్డికి సీఎం జగన్ మొండిచేయి చూపినట్లు తెలుస్తోంది. టీడీపీ అధినేతను విమర్శించాలన్న జగన్ షరతును మహీధర్‌రెడ్డి తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టంగుటూరు మండలం కందులూరు గ్రామానికి చెందిన వైసీపీ బీసీ సెల్ నాయకుడు బొట్ల రామారావుకు కందుకురు నుంచి పోటీకి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన్ను పిలిపించుకున్న జగన్ 'కందుకూరు వెళ్లండి. పనిచేసుకోండి. రేపు పోటీచేయాలి' అని అనడంతోపాటు మహీధర్‌రెడ్డి విషయం నేను చూసుకుంటా పో అన్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసి ఆ నియోజకవర్గంలోని మానుగుంట అనుచరగణం అగ్గిమీద గుగ్గిలం అవుతోంది.



జిల్లాలోకి ప్రవహిస్తున్న సాగర్ జలాలు

జిల్లాకు చేరిన సాగర్ జలాలు

త్రిపురాంతకం, జనవరి 12 : తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు శుక్రవారం జిల్లాకు చేరాయి. సరిహద్దు అయిన 85/3 హెడ్ రెగ్యులేటర్ వద్ద 4.3 అడుగుల లోతులో 840 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు ఎన్ఎస్పీ అధికారులు తెలిపారు. దీంతో ఎస్ఎస్ ట్యాంకులను నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సిద్ధమయ్యారు. ఎక్కడా నీటి చౌర్యం జరగకుండా చర్యలు చేపట్టారు.

పీడీసీసీబీ పాలకవర్గ పదవీ కాలం పొడిగింపు

ఒంగోలు (విద్య), జనవరి 12 : పీడీసీసీ బ్యాంకు పాలకవర్గ పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈమేరకు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి చిరంజీవిచౌదరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బ్యాంకుకు నాన్ అఫీషియల్ పర్సన్స్ ఇన్‌చార్జి కమిటీ ఉంది. అందులో చైర్మన్, ఆరుగురు సభ్యులున్నారు. చైర్మన్‌గా వై.ఎం. ప్రసాద్‌రెడ్డి, సభ్యులుగా ఎం.శేఖర్‌రెడ్డి, ఎం.బాలగురవయ్య, ఎస్‌డీ నూర్‌అహ్మద్, పి.రంగారావు, బి.శివకుమారి, బి.జయరామిరెడ్డి గత ఏడాది జూలై 18న బాధ్యతలు స్వీకరించారు. వీరి పదవీ కాలాన్ని ఈనెల 18 నుంచి జూలై 17 వరకు పొడిగించారు.

ఒంగోలు వైపు చెవిరెడ్డి చూపు

ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి తిరిగి మాగుంటకు టికెట్ ఇవ్వరని తేలిపోవడంతో ఆపార్టీలో సీనియర్ నాయకుడైన తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీచేసే ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయన శుక్రవారం హైదరాబాద్ వెళ్లి బాలినేనిని కలిశారు. మీరు ఓకే అంటే నేను పోటీచేస్తా అని అన్నట్లు తెలిసింది. అంతేగాక సీఎం ఆశీస్సులు ఉన్నాయని కూడా చెప్పినట్లు సమాచారం. వెంటనే బాలినేని 'నేను తిరిగి మాగుంటే పోటీచేయాలని కోరుకుంటున్నా. ఆ విషయాన్ని సీఎంకు చెప్పా. ఇదేమిటో నాకు అర్థం కావడం లేదు' అని వ్యాఖ్యానించారు. మీరు, సీఎం బంధువులు.. ఏమైనా సమస్యలు ఉంటే నేను మాట్లాడతానని చెవిరెడ్డి అనడంతో ఆశ్చర్యపోయిన బాలినేని.. 'నీకో దండం. ఆయన (సీఎం)కో దండం. కాఫీ వచ్చాయి.. తాగి వెళ్లిరండి' అని పంపించివేసినట్లు తెలిసింది. వైవీ సుబ్బారెడ్డికి రాజ్యసభ కేటాయిస్తున్న నేపథ్యంలో చెవిరెడ్డి పేరును కూడా అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుందని, అందుకే ఆయన బాలినేనిని కలిశారని ప్రచారం జరుగుతోంది.

జగన్‌ను కలిసిన వ్యాపారి రవిశంకర్


ఒంగోలులో కాపు సామాజికవర్గానికి చెందిన వ్యాపారవేత్త, రవిప్రియా మాల్ అధిపతి రవిశంకర్ శుక్రవారం సాయంత్రం సీఎం జగన్‌ను కలవడం చర్చనీయాంశమైంది. ఆయనకు అటు బొత్స సత్యనారాయణ, ఇటు గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యలతో దగ్గర బంధుత్వం ఉంది. వ్యాపారపరమైన పనిమీద కలిశారని కొందరు చెప్తుండగా, ఒంగోలు అసెంబ్లీ నుంచి బాలినేని స్థానంలో కాపు సామాజికవర్గం వ్యక్తిని రంగంలోకి దింపాలని జగన్ ఆలోచిస్తున్నట్లు ప్రచారం ఉంది. దీంతో రవిశంకర్ సీఎంను కలవడం చర్చనీయాంశమైంది. అదే సమయంలో చీరాల మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం సీఎంవోకు వెళ్లి ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిశారు. ఆయన సీఎంను కూడా కలిసినట్లు తెలుస్తోంది. ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి ఆమంచి పేరు కూడా సీఎం మదిలో ఉన్న నేపథ్యంలో ఆ కలయికపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మాగుంటను కలిసిన అనుచరులు

ఒంగోలులో ఉన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఆయన అనుచరులు, అభిమానులు పెద్దసంఖ్యలో కలిశారు. మాగుంట ఎక్కువగా మాట్లాడకుండా కలిసిన వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. ఎవరైనా మరీమరీ అడిగితే 'మీకంతా తెలుసు. ఏం చేద్దామో చెప్పండి' అని ఒక్కమాట అనేసి వారి అభిప్రాయాన్ని తెలుసుకునేందుకే పూర్తి ప్రాధాన్యమిచ్చారు. అయితే నేను రాజకీయాల్లో ఉంటానన్న భరోసాను మాత్రం ఇచ్చినట్లు ఆయన ముఖ్య అనుచరులు చెబుతున్నారు.



ఒంగోలులో తన అనుచరులతో సమావేశమైన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



- వారంలో ఐదు కేసులు
- పరీక్షలు చేయించుకొనేందుకు ముందుకు రాని ప్రజలు
- పండుగ సీజన్ కావడంతో అందరిలోనూ ఆందోళన

మళ్లీ కొవిడ్ దడ

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 12 : జిల్లాలో మళ్లీ కొవిడ్ దడ పుట్టిస్తోంది. వారంలో ఐదు కేసులు నమోదయ్యాయి. గత శుక్రవారం ఒక్కరోజే మూడు కేసులు వెలుగు చూడగా, సోమవారం ఒకటి, తాజాగా మరొకటి నిర్ధారణ అవడం కలవరం రేకెత్తిస్తోంది. పండుగ సీజన్ ప్రారంభం కావడంతో ప్రజానీకం రాకపోకలు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో కరోనా కేసులు నమోదవుతుండటం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. దేశవ్యాప్తంగా ఇటీవల కొవిడ్ పాజిటివ్‌ల సంఖ్య పెరిగిపోతోంది. కరోనా తొలి, రెండో విడతల్లో నెలకొన్న పరిస్థితులను తలచుకొని ప్రజలు భయపడిపోతున్నారు. అదేసమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఇప్పటికే కరోనా పరీక్షల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. జీజీహెచ్‌లో స్పెషల్ వార్డులను కూడా ఏర్పాటు చేశారు. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా కరోనా టెస్టు చేయించుకోవాలని వైద్యాధికారులు చెప్తున్నా ప్రజలు పెద్దగా ముందుకు రావడం లేదు. గత శుక్రవారం జిల్లాలో మూడు కేసులు నమోదయ్యాయి. వీరిలో ఒంగోలు దేవుడు చెరువుకు చెందిన ఒక యువకుడు, మండల కేంద్రమైన మద్దిపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, పొదిలి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలోని కంభాలపాడుకు చెందిన మరొకరు ఉన్నారు. దేవుడుచెరువుకు చెందిన యువకుడు డిష్‌లో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. అతను ఇంటింటికీ వెళ్లి బిల్లులు వసూలు చేస్తారని సమాచారం. ఆయన కొద్దిరోజులు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కూడా ఉండి వచ్చారు. మద్దిపాడుకు చెందిన యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా, మరొకరు చిరువ్యాపారి అని సమాచారం. కరోనా ఒకరి నుంచి ఒకరికి సోకే అవకాశం ఉండటంతో వారంతా ఎక్కడెక్కడ తిరిగారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. సోమవారం ఒంగోలులోని లంబాడీడొంకలో వెల్డింగ్ పనిచేసే వ్యక్తికి వైరస్ సోకినట్లు తేలింది. ఆయన్ను కోల్‌కతాకు చెందిన చెందిన వ్యక్తి వచ్చి కలిశాడు. అతని ద్వారానే కరోనా వచ్చినట్లు వైద్యులు భావిస్తున్నారు.

తాజాగా మరో కేసు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో కొవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. బాపట్ల జిల్లా తెనాలికి చెందిన మహిళ మహారాష్ట్రకు వెళ్లి వచ్చారు. అనంతరం ఇంకొల్లులోని తల్లి ఇంటికి చేరుకున్నారు. అనారోగ్యంగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌లో పరీక్ష చేయించుకున్నారు. శుక్రవారం వచ్చిన ఫలితాల్లో పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఆమె ఇంకొల్లులోని తన తల్లి ఇంట్లో ఐసోలేషన్‌లో ఉండి చికిత్స పొందుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్ఎంవో డాక్టర్ బి.తిరుమలరావు తెలిపారు. దీంతో జిల్లాలో నమోదైన కొవిడ్ పాజిటివ్‌ల సంఖ్య ఐదుకు చేరింది. ఇప్పటికే పండుగ సీజన్‌లో ప్రజానీకం రాకపోకలు ఆర్టీసీ బస్సుల్లో పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరోనా బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించడంతోపాటు భౌతిక దూరం పాటించాలని వైద్యులు సూచిస్తున్నా ప్రజలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

సడలని పోరు

- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె
- నోటీసులు పంపుతున్న అధికారులు
- వెనక్కుతగ్గని కార్యకర్తలు, ఆయాలు
- పలు సంఘాల మద్దతు



కలెక్టరేట్ వద్ద ధర్నాలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నేతలు

ఒంగోలు నగరం, జనవరి 12 : అంగన్‌వాడీల పోరు కొసాగుతోంది. వేతనాలపెంపు, గ్రాట్యుటీ అమలు ప్రధాన డిమాండ్‌లతో వారు చేస్తున్న సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. వెంటనే విధుల్లో చేరకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఓవైపు ప్రభుత్వం నోటీసులు జారీచేస్తున్నా కార్యకర్తలు వెనక్కి తగ్గడం లేదు. నాలుగు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటించడంతోపాటు విధుల్లో చేరాలంటూ ఒత్తిడి చేసిన ఐసీడీఎస్ అధికారులు గురు, శుక్రవారాల్లో నోటీసులను రెవెన్యూ అధికారుల ద్వారా కార్యకర్తలు, ఆయాల ఇళ్లకు పంపిస్తున్నారు. వారు లేకపోతే ఇంటికి అంటించి వస్తున్నారు. మరోవైపు పోస్టల్ శాఖ ద్వారా కూడా నోటీసులు పంపుతున్నప్పటికీ ఎక్కువ మంది తీసుకోవడం లేదు. ప్రభుత్వ చర్యలతో ఒకరిద్దరు కార్యకర్తలు కేంద్రాలను తెరిచేందుకు ప్రయత్నించగా వారిని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అడ్డుకుంటున్నారు. కాగా కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న దీక్షలను శుక్రవారం జిల్లా మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.చిరంజీవి ప్రారంభించారు.

వారికి సంఘీభావంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్ పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. పండుగ రోజుల్లో వారిని రోడ్డున పడేసిందని చెప్పారు. మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు కృష్ణమోహన్, ఆర్.రాజు, కేవీపీఎస్ నాయకుడు రఘురామ్, జిల్లా అధ్యక్షుడు జయరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు మోజెస్, రామారావు, అత్తింటి శ్రీను, రాఘవులు, ఐద్వా నాయకులు రమ, ఆర్టీసీ యూనియన్ నాయకులు అయ్యప్పరెడ్డి, మల్లికార్జున, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నపూర్ణ, కేవీ సుబ్బమ్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లావ్యాప్తంగా అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో శుక్రవారం అంగన్‌వాడీలు ధర్నాలను కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

టీడీపీలో 50 కుటుంబాలు చేరిక

వైసీపీ నుంచి వచ్చిన కాపులను ఆహ్వానించిన గిద్దలూరు ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 12 : కాపుసామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరినీ గిద్దలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని వైసీపీకి చెందిన కాపు నాయకుడు అబ్బు ఓబయ్య 50 కుటుంబాలతో కలిసి టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాన్వావలి, నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, పాముల వెంకటరమణ, కె.యోగానంద్, ఒ.వెంకటయ్య, పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



కాపు నాయకుడు ఓబయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

ఆన్‌లైన్ విధానంలో పెన్షన్ ఆథరైజేషన్ ప్రక్రియ

• ట్రెజరీ సంచాలకులు మోహనరావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12: ఆన్‌లైన్ విధానంలో పెన్షన్ ఆథరైజేషన్ ప్రక్రియకు చర్యలు చేపట్టినట్లు ఖజానా, లెక్కలశాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎన్.మోహనరావు పేర్కొన్నారు. ఒంగోలులోని సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రెజరీ అతిథిగృహాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖజానా శాఖ ద్వారా 3.75 లక్షల మందికి పెన్షన్లను చెల్లిస్తున్నట్లు తెలిపారు. ట్రెజరీ ఉద్యోగులకు మెరుగైనవసతులు కల్పించేందుకు రాష్ట్రంలో 130 నూతన భవన సముదాయాలకు ప్రభుత్వ అనుమతి పొందినట్లు చెప్పారు. జిల్లా ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్, పెన్షన్‌దారుల సహకారంతో అతిథిగృహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీడీ జగన్నాథరావు, సహాయ ఖజానాధికారులు రాజ్‌కుమార్, ఎలీషారాణి, కేవీ.కెనడి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీ.నారాయణ, అబ్దుల్‌ఖాదర్, రాష్ట్ర కార్యదర్శి పి.కోటిసుధీర, పెన్షన్‌దారుల సంఘ నాయకులు ఆల్‌ఫ్రెడ్, పి.హనుమంతరావు, ఆచారి, అంకిరెడ్డి. రఘురామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ వితరణ

చీమకుర్తి, జనవరి12 : గత పక్షం రోజులకు పైగా తమ న్యాయమైన కోర్కెల సాధనకు కృషి చేస్తూ జీతాలు కూడా పొందని ఉద్యోగులకు చీమకుర్తి మండల యూటీఎఫ్ శాఖ వెన్నుదన్నుగా నిలిచింది. రూ.1.31లక్షలను అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష ఉద్యోగులకు శుక్రవారం స్థానిక యూటీఎఫ్‌భవన్‌లో డాక్టర్ జవహర్, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శివాజీ, యూటీఎఫ్ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి వీరాంజనేయులు, అక్బర్, చినస్వామి, నల్లూరి వెంకటేశ్వరావు, చలువాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో సంక్రాంతి సంబరాలు

ఒంగోలు(క్రైం), జనవరి12: ఒంగోలులోని జిల్లా జైలులో సంక్రాతి సంబరాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళీ ఖైదీలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఎం.భ్రమరాంబిక, జైలు డాక్టర్ బ్రహ్మతేజ పరిశీలించారు. ప్రథమ బహుమతి ఎం.జయలక్ష్మి, రెండో బహుమతి జి.నిర్మల, మూడువ బహుమతి వై.బుజ్జమ్మలు కైవసరం చేసుకున్నారు. కార్యక్రమంలో జైలర్ రమేష్, డిప్యూటీ జైలర్ బి.శ్రీనివాసరావు, చీఫ్ వార్డర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాభివృద్ధికి ఐక్యంగా పాటుపడదాం'

టంగుటూరు, జనవరి 12 : గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా కృషి చేద్దామని మాఊరు అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పిలుపునిచ్చారు. కారుమంచిలో ఇంటింటికీ ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి రావలసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ఇచ్చినట్లే ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వెనక్కిలాగేసుకుందని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు ఈదర ప్రభాకర్, గ్రామ కోఆర్డినేటర్ చిట్టేల రామిరెడ్డి, గ్రామ పెద్దలు చిల్లర శంకరరావు, గాలం జయరామయ్య ఆత్మకూరి శ్రీను, గాలం జాలరామయ్యలు ప్రసంగించారు.

వచ్చే ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలి

కొత్తపట్నం(ఒంగోలు నగరం), జనవరి 12: రానున్న ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని పలువురు నాయకులు కోరారు. కొత్తపట్నంలోని బస్టాండ్‌సెంటర్‌లో గల కళ్యాణ మండపంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బీసీ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి గేనం సుబ్బారావు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో వైసీపీ బుద్ధి చెప్పాలన్నారు. బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. బీసీలకు మంచి రోజులు రావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, ఇందుకోసం నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు టి.రమాదేవి, సుధాకర్, అజిమున్నిసా, మండల బీసీసెల్ అధ్యక్షులు బలగాని వెంకటేశ్వర్లు, బలగాని వెంకట నారాయణ, మేకల జక్రయ్య, మూగ పోలురాజు, పల్లెపాలెం ఎంపీటీసీ నరసింహారావు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా మోదీ కుయుక్తులు : సీపీఐ

ఒంగోలు(కలెక్టరేట్),జనవరి 12 : కేంద్రంలోని మోదీ, షాలు మరోసారి దేశ ప్రజలపై మతం మత్తు చల్లి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈనెల 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రధాని మోదీ ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం బాటలోనే రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన సీఎం జగన్ తాడేపల్లి ప్యాలస్‌కే పరిమితమై సీట్లు, ఓట్లు అంటూ తర్జన భర్జలు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పడిపోయింది సీఎం జగన్ గ్రాఫ్ అని, ఎమ్మెల్యేలది కాదన్నారు. వలంటీర్ల కన్నా తమ బతుకు హీనంగా మారిందని ఎమ్మెల్యేలే వాపోతున్నారని ఈశ్వరయ్య చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్తానన్న జగన్ ఇప్పుడు ఆ మాట విస్మరించారని ఆరోపించారు. అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలుచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గంగా ఉందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, పీవీఆర్‌చౌదరి, కొత్తకోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి విద్యాసంస్థల వార్షికోత్సవం



ఎంపీ మాగుంటకు బొకే ఇస్తున్న రమణారెడ్డి తదితరులు

ఒంగోలు(రూరల్), జనవరి12: ఒంగోలులోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఉన్నతస్థితికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కరస్పాండెంట్ రమణారెడ్డి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులు సైతం అసాధారణ ఫలితాలు వచ్చేలా అధ్యాపకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతేడాది మంచిఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, రెడ్‌క్రాస్ ఛైర్మన్ ప్రకాశ్ బాబు, డైరెక్టర్ గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ..సురేష్, పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హిట్ అండ్ రన్ చట్టంపై పోరాటం

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొస్తున్న ప్రమాదకరమైన హిట్ అండ్‌రన్ చట్టాన్ని రద్దుచేసే వరకు కార్మికులు పోరాడాలని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులోని సీఐటీయూలో రీజనల్ అధ్యక్షుడు బీవీరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ చట్టం ద్వారా డ్రైవర్ వృత్తికే ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. సమావేశంలో నాయకులు గుంటెనపల్లి శ్రీనివాసులు, సుజాత, మీరావలి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మెజారిటీ వైసీపీ నాయకులు దూరం..!

పీడీసీసీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు డాక్టర్ వెంకయ్య వర్గం గైర్హాజరు

నియోజకవర్గ వెలుపల నుంచి జనం తరలింపు ● ఐక్యంగా సురేష్‌ను గెలిపించాలని విజయసాయిరెడ్డి పిలుపు

కొండపి, జనవరి 12 : కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి సురేష్ పరిచయ సమావేశానికి నియోజకవర్గంలోని పలువురు కీలక వైసీపీ నాయకులు డుమ్మా కొట్టారు. గడచిన ఎన్నికల్లో కొండపి నుంచి వైసీపీ తరఫున పోటీ చేసిన పీడీసీసీబీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ మాదాశి వెంకయ్య, ఆయన అనుచరులు ముఖం చాటేశారు. ప్రధానంగా మాజీ మంత్రి బాలినేని, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అనుచరులుగా ఉన్న పలుగ్రామాల నాయకులు గైర్హాజరవడం గమనార్హం. కొండపి ఏఎంసీ ఛైర్మన్ గోగినేని శారద, ఆమె భర్త, వైసీపీ మండల మాజీ కన్వీనర్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కె.స్వప్నకుమారి తోపాటు ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు హాజరు కాలేదు. కొండపి మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు చెందిన వైసీపీలోని ఓ వర్గం నాయకులు డుమ్మాకొట్టారు. అదేవిధంగా జరుగుమల్లి మండల వైసీపీ ప్రధాన నాయకుడు బెల్లం సత్యనారాయణతోపాటు దాదాపు 15 గ్రామాల నుంచి వైసీపీ నాయకులు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. టంగుటూరు మండలంలో కీలకమైన వైసీపీ నాయకులు కనిపించలేదు. సింగరాయకొండ నుంచి యన్నాబత్తిన చిన్నా, రవికుమార్‌రెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి హాజరైనా ఎడముఖం పెడముఖంగానే వేదికపై వ్యవహరించారు. వేదికపై ఉన్న అందరూ చేయి పట్టుకోవాలని విజయసాయి కోరగా పక్కనే



చేతులు పట్టుకుని ఐక్యతను ప్రకటిస్తున్న నాయకులు

ఉన్న సింగరాయకొండ మండలానికి చెందిన రవికుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి చేతులు కలపకుండా నిలుచున్నారు.

అసమ్మతి స్వరం వినిపిస్తే కేసులే..

పోలీసుల ద్వారా గురువారమే అన్ని మండలాల అసమ్మతి నాయకులకు హెచ్చరికలు వెళ్లాయి. కార్యక్రమం వద్ద ఎవరైనా అలజడి, అసమ్మతి మాటలు మాట్లాడినా, గోలలు చేసినా కేసులు నమోదు చేయాలని వైసీపీ ముఖ్య నాయకులు చెప్పారని పోలీసులు అన్ని మండలాల్లోని వైసీపీ నాయకులకు ముందుగానే హెచ్చరికలు పంపారు. దీంతో అసమ్మతి నాయకులు కార్యక్రమానికి హాజరు కాలేదు. పెదకండ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ ఉపన్యాసాల అనంతరం వేదికపైకి ఎక్కి విజయసాయిరెడ్డితో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లేదని, ఇలా అయితే ఇబ్బందేనని ధైర్యం చేసి చెప్పడం గమనార్హం. మొత్తంగా రెండు వేల మందితో ఆత్మీయ సమావేశం అని వైసీపీ నాయకులు ఆర్భాటపు ప్రచారం చేశారు. కార్యక్రమానికి దాదాపు 600 మంది వచ్చారు. వారు కూడా నియోజకవర్గంలోని, వెలుపల నియోజకవర్గాల నుంచి హాజరయ్యారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి మంత్రి సురేష్‌ను కొండపిలో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. స్థానిక కామేపల్లిరోడ్డులో శుక్రవారం జరిగిన వైసీపీ కార్యకర్తల, నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సాగర్‌నీరు నియోజకవర్గంలోకి వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మంత్రి సురేష్, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, వైసీపీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వేమూరు, ఎర్రగొండపాలెం నుంచి కూడా వాహనాల్లో అనేక మంది వచ్చి పాల్గొనడం చర్చనీయాంశమైంది. వైసీపీలో బాలినేని భవిష్యత్‌కు ఇబ్బంది లేదని విజయసాయి రెడ్డి చెప్పారు. కొండపిలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తీరు క్రమశిక్షణారాహిత్యం

వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయ్‌సాయిరెడ్డి ● పేలవంగా మంత్రి మేరుగ పరిచయ సభ ● పలువురు నాయకుల గైర్హాజరు

చీమకుర్తి, జనవరి 12 : వైసీపీ అధిష్ఠాన నిర్ణయానికి వ్యతిరేకంగా సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకరబాబు వ్యవహరించిన తీరు క్రమశిక్షణారాహిత్యమే అని రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ విజయ్‌సాయిరెడ్డి హెచ్చరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా అధిష్ఠానం నిర్ణయించి దాదాపు మాసం గడిచిన తదుపరి పరిచయ వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం ఒంగోలు శివారునున్న విష్ణుప్రియహాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసాంతం ఐప్యాక్ ప్రతినిధి నిర్వహించగా, ముఖ్యఅతిథులుగా విజయసాయిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ నందిగం సురేష్, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, జిల్లా కన్వీనర్ జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సుధాకరబాబు తనకు పంపిన మెసెజ్‌లో నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు నాగార్జున పరిచయవేదికలో పాల్గొనటానికి సుముఖంగా లేరని, ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారన్నారు. ఈ చర్యను తాము క్రమశిక్షణారాహిత్యంగా భావిస్తున్నామని చెప్పారు. ఈ మాట ఆయన అంటుండగా కొంతమంది సభలో పాల్గొన్న నాయకులు టీజేఆర్‌ను సస్పెండ్ చేయండి అంటూ కేకలు పెట్టగా, అది మన చేతుల్లో లేదని, అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు. ప్రతిపక్షాలను బూతులు తిట్టాలని తాము చెప్పటం లేదని వారు చేసే విమర్శలను తిప్పికొట్టాలని మాత్రమే చెప్పామన్నామన్నారు. త్వరలో చేపట్టే బస్‌యాత్రను విజయవంతం చేయాలని కోరారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ తనకు తలబిరుసు అని, అవినీతి చర్యలకు పాల్పడినట్లు లేనిపోని పుకార్లను వెదజల్లుతున్నారని, అవన్నీ అవాస్తమని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తను కలిసి అందరిని కలుపుకొని పోతానన్నారు. అనంతరం బూచేపల్లి వెంకాయయ్య, శివప్రసాదరెడ్డిలు మాట్లాడుతూ జగనన్న నిర్ధేశించిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలపించటానికి తాము కృషి చేస్తామన్నారు. జంకె మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డిల సహకారంతో జిల్లాలో రాబోయే ఎన్నికల్లో విజయదుందుభి మోగిస్తామన్నారు. కాగా సమావేశానికి సంతనూతలపాడు మండలం నుంచి ముఖ్యనాయకులు దుంపా చెంచిరెడ్డి, జడ్పీటీసీ రమణమ్మతో పాటు ముఖ్య



మంత్రి నాగార్జునను పరిచయం చేస్తున్న విజయసాయిరెడ్డి

నాయకులు మాత్రమే కాకుండా ఒకరూ అరా తప్ప ఈ సమావేశానికి హాజరు కాకపోవటం విశేషం. అలాగే నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల నుంచి సైతం ముఖ్యనాయకుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. చీమకుర్తి మండలం నుంచి మాత్రం పెద్ద ఎత్తున కార్యక్రమానికి తరలివచ్చారు. సగం హాలు వీరితోనే నిండిపోయింది. కాగా విజయసాయిరెడ్డి మాట్లాడుతుండగానే సగం కుర్చీలు ఖళీగా ఉండటం కొసమెరుపు. కార్యక్రమంలో జూపూడి ప్రభాకర్, యాదాల అశోక్, కనకారావు మాదిగ, తాటిపర్తి చంద్రశేఖర్, కసుకుర్తి ఆదెన్న, వేమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలికవసతులు : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12 : త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల పరిశీలన పూర్తి చేశామని, జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపుతో పాటు చెక్ పోస్టుల ఏర్పాటుకు పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఈవీఎంల విభజన రాజకీయ పార్టీల సమక్షంలో జరుగుతుందన్నారు. ఈనెల 22వతేదీన పారదర్శకంగా తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, ఎస్‌కే.రసూల్, గుర్రం సత్యం, బి.రఘురాం, స్వరూప్ తదితరలుఉ పాల్గొన్నారు. కాగా ఎన్నికలకు అవసరమైన ఇంటిలిజెన్స్ నెట్‌వర్క్ బలోపేతంపై కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికగర్గ్, ఉన్నతాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ఎక్సైజ్ అధికారి ఆవులయ్య, జిల్లా ట్రెజరీ డీడీ జగన్నాథరావు, ఎల్‌డీఎం అబ్దుల్‌రహీమ్, ఏడీ డి.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి

రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ తన చాంబర్‌లో శుక్రవారం ఎఫ్‌పీజీల బలోపేతంపై రూపొందించిన పుస్తకాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు కలెక్టర్ అందజేసి మాట్లాడారు. రైతు భరోసా కేంద్ర స్థాయిలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారులు, సాంకేతిక సహాయకులందరూ మూడు రోజుల పాటు ఒంగోలులో నిర్వహించిన శిక్షణ ద్వారా తమ నైపుణ్యాలను పెంపొందించుకొని క్షేత్ర స్థాయిలో రైతులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నానరరు.

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

చీమకుర్తి, జనవరి12 : చంద్రన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా చీమకుర్తిలోని ఎంఎస్ఆర్ ప్రాంగణంలో ముగ్గులపోటీలను నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల విజేతలు ఈనెల 14న చీమకుర్తిలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు



ముగ్గులను పరిశీలిస్తున్న నాయకులు

రూ.లక్ష బహుమతిగా అందజేయనున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, ప్రధానకార్యదర్శి అవనిగడ్డ శేషారావు, మన్నం ప్రసాద్, ఉన్నం సుబ్బారావు, రావిపాటి రాంబాబు, గంగుల శివపార్వతి, కాట్రగడ్డ రమణయ్య, సూరంపల్లి హనుమంతరావు, కందిమళ్ల గంగారావు, రావిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేస్ విద్యార్థినికి బంగారు పతకం

ఒంగోలు(విద్య), జనవరి 12: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎం.కావ్య పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరంచదువుతున్న కవ్య సత్తా చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, మద్దిశెట్టి కళ్యాణ్‌లు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఏవో రమణబాబు, డీన్ వీరాంజనేయులు, రూపఆన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీల పరిశీలన

చీమకుర్తి, జనవరి12 : చీమకుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. క్రీడాకారులతో ముచ్చటించారు. ఏర్పాట్లపై కమిషనర్ షేక్ ఫజులుల్లాను ప్రశంసించారు. కార్యక్రమంలో పీడీ స్వరూపావాణి పాల్గొన్నారు.

చీమకుర్తి అభివృద్ధికి కృషి : ఎంపీపీ

చీమకుర్తి, జనవరి12 : చీమకుర్తి మండల అభివృద్ధికి తమ పాలకవర్గం కృషి చేసిందని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత దాదాపు రూ.6కోట్లతో 1671 పనులు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీడీవో రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

టంగుటూరు, జనవరి 12 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మె 32వ రోజు శుక్రవారం టంగుటూరులో కొనసాగించి కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12 : సంక్రాంతి పండుగ సీజన్‌లో ప్రజానీకం కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఎస్.రాజ్యలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మాస్కు వాడటంతో పాటు భౌతికదూరాన్ని పాటించాలన్నారు. పండుగ రోజులు కావడంతో ప్రజానీకం షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, ఆలయాలు, హోటల్స్‌కు వెళ్లేటప్పుడు, ట్రైన్, బస్సుల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ మాస్కు ధరించడంతో పాటు జనావాసాలలో గుమికూడవద్దని సూచించారు. ఎవరికైనా జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కానీ, జిల్లా సర్వజన ఆస్పత్రిలో చూపించుకోవాలని ఆమె కోరారు.

కోడిపందేలు వేస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ఒంగోలు(క్రైం), జనవరి 12: సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు, జూదం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికగర్గ్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సంప్రదాయ క్రీడలతో పండుగ జరుపుకోవాలని సూచించారు. కోడిపందేలకు పాల్పడే వారిని గుర్తించి బైండోవర్ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు వేస్తే 112, 100 నంబర్లకు, అలాగే పోలీసు 9121102266 వాట్సాప్‌నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ వెల్లడించారు.

విజయసాయిరెడ్డికి అంగన్‌వాడీల వినతి

కొండపి, జనవరి 12 : వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డికి అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కొండపిలో వినతిపత్రం అందజేశారు. వైసీపీ ఆత్మీయ సమావేశానికి వచ్చిన విజయసాయిరెడ్డి, మంత్రి సురేష్, వైసీపీ నాయకులు ప్రదర్శనగా కొండపిలో వెళ్తుండగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. అనతరం కల్యాణ మండపంలో వైసీపీ సమావేశం ముగిశాక విజయసాయికి వారు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కేజీ మస్తాన్, సీఐటీయూ నాయకుడు వందనం, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పున్నమ్మ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి రూ.10వేల సాయం

టంగుటూరు, జనవరి 12 : పొందూరులో దివంగత పమిడి కోటయ్య జయంతి సందర్భంగా వైద్య విద్యార్థి కొక్కిలిగడ్డ ఉదయ్‌కిరణ్‌కి కోటయ్య కుమార్తె మీనాకుమారి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కోటయ్య జయంతి శుక్రవారం పొందూరులో ఘనంగా నిర్వహించారు. తొలుత అతిథులందరూ కోటయ్య, వెంకటశేషమ్మ దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు పమిడి నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు చంద్రమౌళి, పంచాయతీ సభ్యుడు సుదర్శన్, ఆనందరావు పాల్గొన్నారు.

నేడు ఒంగోలులో షటిల్ పోటీలు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 12 : ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి ఏజ్‌లెస్ జిల్లా స్థాయి షటిల్ పోటీలు శనివారం ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు జి.అజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 సంవత్సరాల వయస్సు పైబడిన వారు పాల్గొంటున్నారని, మొత్తం 32 టీములు హాజరవుతున్నట్లు తెలిపారు. నాకౌట్ పద్ధతిన జరిగే ఈ పోటీలను స్థానిక ఆర్కిడ్స్ స్కూలులో నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 99663 41467 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.



స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు పోవాలి

• కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12 : స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు జిల్లా యువజనసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతి సందర్భంగా స్థానిక కొత్తపట్నం బస్టాండులోని స్వామివివేకానంద విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సెట్ప్ సీఈవో లోకేశ్వరరావు, కమిషనర్ వెంకటేశ్వరరావు, కో ఆర్డినేటర్ జయ తదితరులు ఉన్నారు. అలాగే భారతీయ జనతా మోర్చా జిల్లా అధ్యక్షుడు పువ్వాడ దామోదర్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొద్దులూరి ఆంజనేయులు, టి.నాయక్, నాగశేషు, డేగ సురేష్, ధనిశెట్టి రాము, అనిల్, సీతారామయ్య పాల్గొన్నారు. జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్వామీ వివేకానంద విగ్రహానికి ఆర్‌జేడీ వీఎస్.సుబ్బారావు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి మహతి బాలాజీ, పర్రె వెంకటరావు, రాజేంద్రప్రసాద్, కె.



నివాళులర్పిస్తున్న కలెక్టర్

శేషారావు, కె.రాము, బి.హెప్సిబా, చెక్కా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, ముత్యాల కళ్యాణ్, రాయని రమేష్, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష, అనిల్ కుమార్, కోట సుధీర్, నరసింహారావు, రాఘవ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు(కల్చరల్): స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఆర్ శర్మా కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షులు సొల్లేటి వెంకట్, ఫౌండర్ కూరపాటి రమేష్, పార్థసారథి, సుబ్బారావు, జనార్దన, ఆంజేయులు, మిరియాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అటు స్థానిక హైదరీ క్లబ్‌లో జరిగిన వివేకానంద జయంతి యూత్ ఫెస్టివల్‌కు జేసీఐ వైస్ ప్రెసిడెంట్ కె.శివకోటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు.



ప్రజా పరిచయ వేదిక
వృత్తిలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,
ప్రతి నిమిషం ప్రజాసేవకై పరితపిస్తూ..
ఎన్నో సందర్భాలలో పేద, బడుగు బలహీన
వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తూ...
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు IRS
(చిన్న బుజ్జి) గారు ప్రజలకు మరింత సేవ చేయాలనే
దృఢ సంకల్పంతో, ఎన్టీఆర్ గారి స్ఫూర్తి,
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
ఆశయ సాధనకై మన ముందుకు
వస్తున్న సందర్భముగా వారికి ఇవే మా
హృదయపూర్వక శుభాకాంక్షలు
అందరికీ
ఆత్మీయ ఆహ్వానము
నేడు
ది.13-01-2024
ఉదయం
10.00 గం.లకు
మన బాపట్లలోని
విలియం బూత్
జూనియర్ కళాశాల ప్రక్కన,
క్రిస్టియన్ భవన్
ఆవరణములో
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు
IRS (చిన్న బుజ్జి)
దేవతోటి సుందరయ్య
టిడిపి రాష్ట్ర యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి, చీరాల
దేవతోటి నాగరాజు
పర్చూరు నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
పంతాని మురళీధరరావు
రాష్ట్ర టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి, రేపల్లె
దేవతోటి నాగరాజు
బాపట్ల పార్లమెంట్ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
పెనుమాల డేవిడ్
బాపట్ల పార్లమెంటు టిడిపి యస్.సి.సెల్ అధికారప్రతినిధి
జంగం ప్రవీణ్
బాపట్ల పార్లమెంటు టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
చుక్కా కోటయ్య
రేపల్లె నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ అధ్యక్షులు
పల్లం సరోజనీ
టిడిపి బాపట్ల పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి
కూచిపూడి ఝాన్సీరాణి
టిడిపి బాపట్ల పార్లమెంటు కార్యదర్శి
జంగం రాజశేఖరరావు
విశ్రాంత సి.ఇ.ఓ. సంతరావూరు
జి.వి. దాగేశ్వరరావు
టిడిపి ఆఫీస్ ఇన్‌ఛార్జ్, రేపల్లె
వెంకట్రావు
పర్చూరు నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
ఇట్లు : బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు

సమష్టి కృషితో విజయం సాధిద్దాం

● మార్కాపురం టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి ● టీడీపీ జనసేన మేనిఫెస్టోపై అశోక్‌రెడ్డి ప్రచారం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్ జనవరి 12: రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టి కృషితో పార్టీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కార్యకర్తలను కోరారు. మండలంలోని పెద్దయాచవరం, నాయుడుపల్లి, గజ్జలకొండ గ్రామాలలోని పార్టీ కమిటీ, బూత్ కమిటీ, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్, గ్రామ కమిటీలు ప్రతి ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజుల రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గొలమారి నాసర్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

బేస్తవారపేట : టీడీపీ, జనసేనల ఉమ్మడి మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి తెలియజేయాలని, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్ ఇన్‌చార్జ్ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ, జనసేనల ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, మూప్పూరి రాము, బోయిళ్ళ రోషన్‌బాబు, బీసు అరుణ్ బాబు, నందు రమేష్ పాల్గొన్నారు.

రాచర్ల : వైసీపీ పాలనలో వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధిలో ప్రగతిపథంలో పరుగులు పెట్టించేం దుకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. శుక్రవారం రాచర్లలో కటికె యోగానంద్ అధ్యక్షత జరిగిన టీడీపీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిమెట్ట సర్పంచ్ రెడ్డి.కాశిరెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, యామా సంజీవయ్య, లక్ష్మీరెడ్డి, షేక్ తాహర్‌బాషా, సనావుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం నియోజకవర్గం పూర్తిగా వెనుక బడిన ప్రాంతం అని టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి మినహా ఈ ప్రభుత్వంలో జరిగింది ఏమీ లేదని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని 2024లో టీడీపీ అధికారంలో రావడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల నాటికి 1.30 లక్షల మంది ఓటర్లను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించాలన్నదే నా కర్తవ్యం అని అన్నారు. నియోజకవర్గంలో ఒక పర్యాయం కాంగ్రెస్ రెండు పర్యాయాలు వైసీపీ ఎమ్మెల్యేలు విజయం సాధించారన్నారు. వారు నియోజక వర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. సాగునీరు, తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని వాయిదా వేయడమే అందుకు నిదర్శనమన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, తెలుగు యువత అధ్యక్షులు కొత్త భాస్కర్ పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : టీడీపీ అధినేత నారా చంద్రబాబుతోనే ఆంధ్ర రాష్ట్రానికి భవిష్యత్తు అని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మీ, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక 35వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనలో సంక్షోభం నెలకొందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని ఆదరించి సైకో పాలనను తరిమికొట్టాలన్నారు. ఇంటింటికి తిరిగి టీడీపీ-జనసేనలో ఉమ్మడి మేనిఫేస్టోలోని అంశాలను వివరించారు.



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

నేడు విస్తృత స్థాయి సమావేశం

కొమరోలు, జనవరి 12: మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి నివాసంలో శనివారం ఉదయం మండలస్థాయి నాయకులు, కార్యాకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరు కానున్నారన్నారు. రానున్న ఎన్నికలకు పార్టీకి సిద్ధంచేసే కార్యాచరణపై సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలన్నారు.





ప్రచారం నిర్వహిస్తున్న కందుల వసంతలక్ష్మీ, వై.పాలెంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

కారును ఢీకొన్న బొలెరో వాహనం

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

త్రిపురాంతకం, జనవరి 12: ఎదురెదురుగా వస్తున్న కారు-బొలెరో వాహనాలు ఢీ కొనడంతో కారులోని ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వెల్లంపల్లి వద్ద ఎన్‌హెచ్- 544డీ పై శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోర్నాల నుంచి వినుకొండ వైపు కారు వస్తోంది. అదే సమయంలో కుంట వైపు వెళుతున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న పల్నాడు జిల్లా రొంపిచర్లకు చెందిన షేక్ షంషం బేగం(44)కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కారులోని మస్తాన్‌వలి, మస్తాన్‌బీ, నాగూర్‌వలిలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాల సేకరించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



మృతిచెందిన షంషం బేగం

రెండు ఆటోలు ఢీ, ఒకరికి తీవ్రగాయాలు

త్రిపురాంతకం, జనవరి 12: ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రం సమీపంలోని కంకణాలపల్లి రోడ్డులో శుక్రవారం చోటుచేసుకొంది. త్రిపురాంతకం నుంచి ఒడ్డుపాలెం వైపు కూలీలతో మిర్చి కోతలకు కూలీలతో వెళుతున్న ఆప్పీ ఆటోను త్రిపురాంతకం వైపు వస్తున్న నాలుగుచక్రాల ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆప్పీ ఆటోలో ఉన్న జి.శ్రావణికి ఎడమకాలు విరిగింది. దీంతో అదే వాహనంలో త్రిపురాంతకంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

మొక్కలు నాటని వారికి బిల్లులు

● గంటలోనే ముగిసిన సామాజిక తనిఖీ



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

రాచర్ల, జనవరి 12 : ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక శుక్రవారం రాచర్ల ఎంపీడీవో కార్యాల యంలో నిర్వహించారు. కేవలం అధికారులు మాత్రమే ఈ ప్రజా వేదికలో పాల్గొన్నారు. మండలం మొత్తం మీద కేవలం పది మంది రైతులు మాత్రమే హాజరయ్యారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.5.45 కోట్ల విలువైన పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. గ్రామాల నుంచి ప్రజలు ఈ తనిఖీలో పాల్గొనకుండానే సామాజిక తనిఖీని ముగించారు. కేవలం గంటలోనే సామాజిక తనిఖీని అధికారులు ముగించి ఇంటిదారి పట్టారు. పీడీ శీనారెడ్డి సామాజిక తనిఖీలో భాగంగా రికార్డు లను పరిశీలించారు. యడవల్లి, అంకిరెడ్డిపల్లె గ్రామాలలో గ్రామాల్లో ఐదుగురు రైతులు కలిసి 1360 మొక్కలు నాటగా వారికి బిల్లులు ఇవ్వాల్సి ఉంది. మొక్కలు నాటని వారికి బిల్లులు చేసినట్లు అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొత్తకోట పెద్దిరాజు అనే రైతు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో యడవల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను పీడీ వివరణ కోరగా వారి నుంచి స్పందన రాలేదు. మొక్కల అవినీతి పెద్ద ఎత్తున జరిగినట్లు అధికారులు గుర్తించారు. జే.పీ.చెరువు సోమిదేవిపల్లి, కాలువపల్లి, యడవల్లి గ్రామాలలో కొన్ని మస్టర్లలో సంతకాలు లేకుండానే బిల్లులు మంజూరు చేశారు. దీనిపై అధికారులు వారిని వివరణ కోరారు. కొలతల్లో కూడా తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఒద్దులవాగుపల్లిలో ఎక్కువ మొక్కలు నాటినట్లు, అవి పాలిపోయినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. మొత్తం సామాజిక తనిఖీని తూతూ మంత్రంగా ముగించారు. కార్యక్రమాలలో ఎంపీడీవో కవితాచౌదరి, ఏపీడీ భాస్కర్‌రావు, ఏపీవో మోషే ఎస్‌ఆర్‌పీ నాగార్జున పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

ఎర్రగొండపాలెం, జనవరి 12 : ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయం వద్ద ఈనెల 10న ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన షేక్ పెద్ద జానీబాష, మరి కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు గురువారం ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఆ వివరాలను ఎస్.ఐ రాజేష్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. త్రిపురాంతకం గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డి నుంచి పొలం ఆన్‌లైన్ చేయడానికి గంగాపాలెం వీఆర్వో కుమార్‌నాయక్, గురిజేపల్లి వీఆర్ఏ జానీబాష, వారి స్నేహితుడు చింతల చెర్వు వెంకటేశ్వరరెడ్డిలు రూ.20 వేల నగదు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అదే సమయంలో వీఆర్ఏ జానీబాష అన్న షేక్ పెద్దజానీబాష, మరి కొంత మంది వ్యక్తులతో ఏసీబీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో తమ విధులకు అడ్డుపడి ఆటంకం కలిగించారని ఏసీబీ డీఎస్పీ వీ.శ్రీనివాసరావు గురువారం ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో వీరిపై ఫిర్యాదు చేశారు. లంచం తీసుకున్న వీఆర్వో, వీఆర్ఏ, వారి స్నేహితుడికి మద్దతుగా వచ్చిన షేక్ పెద్ద జానీబాష మరి కొంత మంది పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుడారై పాశురం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 12: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో కుడారై పాశురాం కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి, గోదాదేవి ఉత్సవమూర్తులను ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గోదాదేవి శ్రీరంగనాథుని వివాహం సందర్భంగా ధనుర్మాసంలో 30 పాసురాలు నిర్వహించారని, 27వ పాసురం సందర్భంగా 108 గంగాళాల పాయస నివేదన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు అప్పనాచార్యులు తెలిపారు.కార్యక్రమంలో ఈవో జి.శ్రీనివాసులరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





మార్కాపురంలో గోదాదేవికి సమర్పించిన పాయసం, దోర్నాలలో మహిళల పూజలు

గోదాదేవికి పూజలు

పెద్దదోర్నాల : స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే భక్తులు 108 కలశాలతో అమ్మవారిని అహిషేకించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు శ్రీనివాసాచార్యులు, చెన్నయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కంభం : ధనుర్మాసం సందర్భంగా కంభం శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం గోదాదేవి కుడారై ఉత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయశర్మ తెలిపారు. ధనుర్మాసంలో గోదాదేవికి 30 రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. కుడారై ఉత్సవ సాంప్రదాయాన్ని, పూజలను అల్వార్లు చేసేవారన్నారు.

టీడీపీ గెలుపుతోనే గ్రామాల్లో అభివృద్ధి

ఎర్రగొండపాలెం, జనవరి 12 : టీడీపీ గెలుపుతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. ఎర్రగొండపాలెంలోని పడమట బజారులలో శుక్రవారం సాయంత్రం బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎర్రగొండపాలెంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. మురుగునీరు నిల్వడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, తోట మహేష్, కంచర్ల సత్యనారాయణగౌడ్, కొత్త మాసు సుబ్రహ్మణ్యం, షేక్ మస్తాన్ వలి, కొత్త భాస్కర్, రామకిష్ణ, చేదూరి కిశోర్, వి.రమణమ్మ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : నియోజకవర్గంలో వైసీపీకి క్షేత్రస్థాయిలో వరుస షాకులు తగులుతున్నాయి. గ్రామంలో కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీలోనికి చేరికలు జోరందుకున్నాయి. ఇక క్షేత్రస్థాయి రాజకీయాలకు పట్టుకొమ్మలు లాంటి స్థానిక ప్రజాప్రతినిధులు సైతం టీడీపీ గూటికి చేరుతున్నారు. శుక్రవారం రాచర్ల మండలం జే.పీ.చెరువు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, విద్యాకమిటీ చైర్మన్, వార్డుసభ్యులు, కొంత మంది కార్యకర్తలు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు జెట్టి వెంకటేశ్వర్లు, విద్యాకమిటీ చైర్మన్ బూరుగుల ఖాశీంవలి, సచివాలయ కన్వీనర్ సిద్ధం నరసింహులు, పంచాయతీ వార్డుసభ్యులు షేక్ భాషా, రంగస్వామి, నెమలిగుండ్ల రంగనాయకస్వామి కాపుసత్రం ప్రధాన కార్యదర్శి కన్నసాని గోపాల్, పుట్టా గురుమూర్తి, కన్నసాని మురళి, కన్నసాని సుబ్బారావు, సుంకుల పాండు, బూజునూరి శేఖర్‌రెడ్డి, కనుమర్ల శ్రీనివాసులు, గల్లా విజయ్‌కుమార్, తదితరులు చేరారు. కార్యక్రమంలో రాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడ కె.యోగానంద్, జేపీ.చెరువు టీడీపీ నాయకులు షేక్ మహమ్మద్‌ఖాశీం, బొల్లవరం ఆదినారాయణ, వేల్పుల రాజేశ్వరరావు, షేక్ సుభాని, తురిమెళ్ల రవికుమార్, టీడీపీ నాయకులు గోపిరెడ్డి జీవన్‌రెడ్డి, గుడిమెట్ట సర్పంచ్ రెడ్డి కాశిరెడ్డి, భవనం శ్రీధర్‌రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, పాల్గొన్నారు.



గ్యారెంటీ పత్రాలు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

మొక్కల్లో అవినీతిపై విచారణ

పుల్లలచెరువు, జనవరి 12: ఉపాధిహామీ పథకంలో మండలంలో సాగు చేసిన మొక్కల పెంపకంలో భారీ అవినీతిపై కుందంపల్లిలో ఏపీడీ నిర్మళాదేవి శుక్రవారం విచారించారు. ఈ నెల 8న కోమరోలు సర్పంచి కొల్లిపాటి శ్రీనివాసులు ఈ అవినీతిపై కలెక్టరుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ఏపీడీ విచారించారు. గ్రామంలో మొత్తం 51 మంది రైతులు మొక్కలు నాటినట్లు చూపగా, 20 మంది రైతులు మొక్కలు నాటకుండానే బిల్లులు చేసుకున్నారని సర్పంచితో పాటు రైతులు ఆమె వద్ద ఆరోపించారు. గ్రామంలోని భూమిలేని ఒంటేరు సునీత మరికొంతమంది బీనామీల పేర్లతో అక్రమాలకు పాల్పడ్డారని సర్పంచ్ ఫిర్యాదు చేశారు. నర్సీరీలతో సంబంధం లేకుండా సొంతగా నాటుకున్న మొక్కలు సరాఫరా చేసినట్లు చూపి దొంగ సంతకాలతో అధికారులు నర్సీరీలకు బిల్లులు చెల్లించి వాటాలు పంచుకున్నారని వివరించారు. గ్రామంలో ఏపీడీ విచారణ జరుపుతుండగా సర్పంచి శ్రీనివాసులు గ్రామాల్లో పొలాలన చూడాలని కోరారు. అయితే అధికార పార్టీ నాయకులతో పాటు, సీనియరు మేట్‌లు, సర్పంచిపై వాగ్వాదానికి దిగారు. అధికారుల సమక్షంలో తీవ్రంగా దూషించారు. దీంతో ఘర్షణ వాతవరణం నెలకొంది. దీంతో ఏపీడీ విచారణ వాయిదా వేసి వెళ్లిపోయారు. అధికార పార్టీ వాగ్వాదంతో విచారణ పూర్తిగా నిలిచిపోయింది.

రైతులకు న్యాయం చేయాలి: సర్పంచి

అనంతరం సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సీనియరు మేట్ గురుమూర్తి మొక్కలు నాటకుండానే బీనామీ పేర్లతో బిల్లులు లక్షలకు పైగా మేక్కేశాడన్నారు. ప్రభుత్వం రైతులకు 30 రూపాయలు ఇచ్చి నాణ్యమైన మొక్క కొనుగోలు చేసుకోనమని చెప్పినా మండల అధికారులు, సీనీయరు మేట్‌లు కుమ్మకై రూ.5 విలువైన నాశిరకం మొక్కలు అందజేశారన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండానే రూ.4.50 లక్షలు బిల్లులు చేసుకోనేందుకు ప్రయత్నించాడన్నారు. తక్షణమే పూర్తిస్థాయిలో విచారించాలని కోరారు.



విచారిస్తున్న ఏపీడీ నిర్మలాదేవి

అంగన్‌వాడీల కోటి సంతకాల ఉద్యమం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 12: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 32వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదురు నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని, తమ న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. కార్య క్రమంలో ముంతాజ్‌బేగం, సుబ్బమ్మ, పద్మ, వెంకటలక్ష్మీ, సుహాసిని, కుమారి, వెంకటరత్నం, రాణి పాల్గొన్నారు.

గిద్దలూరు, జనవరి 12 : డిమాండ్ల సాధన కోసం గత నెల రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడిలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక రెవిన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రఫీ, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అంగన్‌వాడిల సమస్యలు పరిష్కరించకుండా భయభ్రాంతులకు గురి చేసే పద్ధతిలో ఎస్మా చట్టాలు ప్రయోగించడం వలన ఉపయోగంలేదని, సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. రేపటి నుండి గ్రామాలకు వెళ్ళి ప్రజల మద్దతు కూడగట్టి కోటి సంతకాలతో జగన్ కళ్ళు తెరిపిస్తామన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, విజయలక్ష్మి, వరలక్ష్మి, సిఐటియు నాయకులు ఆవులయ్య, శింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎర్రగొండపాలెం, జనవరి 12 : తమ డిమాండు పరిష్కరించి, జీతాలు పెంచే వరకు సమ్మెలో ఉంటూ ధర్నాలు, నిరసనలు చేస్తామని అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎర్రగొండపాలెంలో ఎస్టీవో హోం ఆవరణలో శుక్రవారం ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు. ఈ ధర్నాలో అంగన్వాడీయూనియన్ నాయకులు జి మల్లేశ్వరి, పి సుబాషిణి,నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ,సునీత, తలపాటి సుబ్బమ్మ, సుజాత, పాల్గొని మాట్లాడారు. ఎర్రగొండపాలెం,త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల నుంచి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నాలో పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

● ఉద్యానశాఖ అధికారి రమేష్

మార్కాపురం రూరల్ జనవరి 12: మిరపలో సకాలంలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఉద్యానశాఖ అధికారి రమేష్ రైతులకు సూచించారు. మండలంలోని రాయవరం, నాయుడుపల్లి గ్రామాలలో మిరప తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మిరపలో తామర పురుగులు ఆకుల అడుగుభాగంలో చేరి రసాన్ని పీలుస్తాయన్నారు. దీంతో ఆకు పైకి ముడుచుకొని పోతుందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పంట కోసే ముందు, తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు అవగాహన కల్పించారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానాధికారి రమేష్

రసాయన మందుల వినియోగం తగ్గించాలి

పొదిలి, జనవరి 12 : ఇటీవల కురిసిన వర్షాల అనంతరం మిరపలో నల్లి, దోమల తీవ్రత ఎక్కువ ఉందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి గోపీచంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచేపల్లి, దాసళ్లపల్లి గ్రామాల్లో మిరపపైరును పరిశీలించారు. నల్లి, దోమ తెగులు నివారణకు రైతులు ఎక్కువగా రసాయమందులు పిచికారి చేస్తున్నారన్నారు. వాటిని తగ్గించాలని సూచించారు. రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం మంచిదన్నారు. మిరప పంటలో జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికితోడు వేప కషాయం, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని వినియోగిస్తూ రసాయన మందుల వినియోగం తగ్గించుకోవాలన్నారు. నీటికుంటల వినియోగాన్ని పెంచాలని అందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానాధికారి సంధ్య, సహాయకురాలు గోవిందమ్మ, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలి



డ్రోన్‌తో పురుగు మందు పిచికారిపై అవగాహన కల్పిస్తున్న రైతులు

మార్కాపురం రూరల్ జనవరి 12: కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రజలకు అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ.కృష్ణారావు అన్నారు. మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప యాత్రలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతులకు డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారి విధానంపై అవగాహన కల్పించారు. డ్రోన్ పిచికారి యంత్రంపై ప్రభుత్వం 40 శాతం రాయితీని అందిస్తుందని మిగతా 60 శాతం బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారులు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

మార్కాపురం రూరల్ జనవరి 12: ప్రభుత్వం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి కోరారు. మండలంలోని బోడపాడు గ్రామంలో శుక్రవారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు కిశోర్ కుమార్, సాయిచరణ్, తేజ్, బాల ఈశ్వరయ్య, శరవని, వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కమల్ల రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి దిలీప్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, 'ఆశ'వర్కర్లు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

సనాతనధర్మ సేవాగ్రామాన్ని సందర్శించిన కలెక్టర్

పొదిలి, జనవరి 12 : కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో నేటి యువ తరానికి స్ఫూర్తిగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటున్న సనాతనధర్మ సేవా గ్రామాన్ని కలెక్టర్ దినేష్ కుమార్ శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మసేవా కేంద్రం మండలంలో ఓబులక్కపల్లి గ్రామంలో నిర్మాణం జరుపుకోవడం శుభపరిణామమన్నారు. అది పూర్తయితే చుట్టూ ఉన్న గ్రామాలకు ఎంతో మంచి జరుగుతుందన్నారు. జగద్గురు శంకరవిజయేంద్ర సరస్వతి స్వామి స్వీయపర్యవేక్షణలో ఈ ఆధ్యాత్మిక కేంద్రం నిర్మాణం జరుగుతోందన్నారు. నేటి యువతరానికి హిందూధర్మం భారతీయ సంస్కృతి, కళలు జీవిత నైపుణ్యాన్ని అందించే విధంగా విజ్ఞాన కేంద్రాలు ఇక్కడ నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ కేంద్రంలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు వివిధ పాఠ్యాంశాలతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. శిల్పకళా, నాధస్వరం, వ్యవసాయం, క్రీడలలో శిక్షణ ఇస్తారన్నారు. అంతేకాకుండా స్థానికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. క్రీడా కేంద్రం, గోశాల, వ్యవసాయంలో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 31 ఎకరాల సువిశాలమైన స్థలంలో ఆధునిక హంగులతో శాశ్వత భవననిర్మాణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయన్నారు. వేదాలు, శాస్త్రీయం ఇతర ధార్మిక విషయాల అధ్యయనంతోపాటు ఆధునిక విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. కంచికామకోటి శంకర విద్యాలయం ద్వారా 6నుండి 12తరగతుల వరకు సీబీఎస్‌సీ, స్టేట్ సిలబర్స్‌తో బోధన చేస్తారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, శిల్పకళా, కుండల తయారీ, హార్టీకల్చర్, అగ్రికల్చర్, టైలరింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ డ్రైవింగ్ వంటివి వాటిలో శిక్షణ ఇస్తారన్నారు. ఆయన వెంట వేదపండితులతోపాటు తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, వీఆర్వో బాలవెంకటరెడ్డి, కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.



సనాతన ధర్మ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

పొదిలి, జనవరి 12 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఓబులక్కపల్లి 209 పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక కేంద్రాలను వార్డులను అధికారులు గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి రాలేని ఓటర్లు ఉంటే వారిని గుర్తించాలన్నారు. అలాంటి వారికి ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం కల్పిస్తామన్నారు. అదేవిధంగా నడవలేనివారు, 80 సంవత్సరాలు పైబడిన వారు ఉంటే గుర్తించాలని బీఎల్వోలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, సామాగ్రితో పాటు మొత్తం 7 రకాల సదుపాయాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డికి సూచించారు. ఎంఈవో శ్రీనివాసరెడ్డి, బీఎల్‌వోలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో దోర్నాల వీఆర్ఏ మృతి

పెద్దదోర్నాల, జనవరి 12: అనారోగ్యంతో దోర్నాల వీఆర్ఏ షేక్ సుభాని (60) మృతిచెందారు. ఈ ఘటన స్థానిక పాత పోలీసుస్టేషన్ వీధిలో శుక్రవారం చోటుచేసుకొంది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సుజాత, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు పీ.యాకోబ్, వీఆర్ఏలు వెంకటేశ్వర్లు, ఆశీర్వాదం తదితరులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.


వాగు ఆక్రమణదారులకు హెచ్చరికలు చేస్తున్న కమిషనర్ నారాయణరావు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

కనిగిరి, జనవరి 12: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక వెన్నెల అపార్ట్‌మెంట్ వెనుక వైపు కొంతమంది వ్యక్తులు వాగు స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించగా శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి ఆక్రమణను అడ్డుకున్నారు. వెన్నెల అపార్ట్‌మెంట్ సమీపంలోని వాగును ఆక్రమించేందుకు కొంతమంది వ్యక్తులు వాగులోని నీటిని ప్రత్యేకమోటర్‌తో బయటకు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కమిషనర్ అక్కడికి చేరుకుని ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు, వంకలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా వారిపై కేసలు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా వాగుల వెంబడి ఉన్న స్వంత స్థలాల యజమానులు కొంతమంది వాగు స్థలాలను కూడా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వాటిని గుర్తించి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేయిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్ఐ ప్రదీప్‌కుమార్, ప్లానింగ్ సెక్రటరీ, సిబ్బంది ఉన్నారు.


పైరుకు రక్షణగా చుట్టూతా కట్టిన రంగురంగుల చీరలు

వరిపైరుకు చీరలే రక్షణ కవచం

పామూరు, జనవరివరి 12 : ఆరుగాలం కష్టపడి పంటలను సాగుచేసిన రైతన్నలు పంట ఉత్పత్తులు చేతికి వచ్చే దశలో అడవి పందులు కంచెలను సైతం పడవేసి పంటలను నాశనం చేస్తున్నాయి. పండించిన పంటలను కాపాడుకోనేందుకు పగలంతా పొలాల వద్దే కాపలాగా ఉంటున్న రైతులు రాత్రి సమయాల్లో వాటిని కాపాడుకొనేందుకు వినూత్న రీతిలో నూతన పంథాను అవలంబిస్తున్నారు. అడవి పందుల బారిన నుంచి పంటను సంరక్షించుకునేందుకు చీరలను రక్షణగా మార్చుకొంటున్నారు. రంగురంగుల పాత చీరలను సేకరించి చేను చుటూంట రక్షణ కవచంలా చుడుతున్నారు.దాంతో రాత్రి సమయాల్లో రకరకాల రంగులను చూడటంతో పాటు హోరున వీచే గాలుల శబ్దాలకు భయపడి పందులు అటువైపు రావడానికి సాహసించవని రైతులు చెబుతున్నారు. రైతుల కష్టం అడవి పందుల పాలు కాకుండా రైతన్నలు చేస్తున్న ప్రయత్నాలను ఎవరైనా అభినందించాల్సిందే.


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ అనంతరం వారితో టీడీపీ నేత రామకృష్ణ

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

● టీడీపీ నేత రామకృష్ణ

హనుమంతునిపాడు(కనిగిరి), జనవరి 12: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ నేత పెంచికల రామకృష్ణ అన్నారు. నియోజకవర్గంలోని హనుమంతునిపాడు మండలంలోని నందనవనం గ్రామంలో శుక్రవారం మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించి కనిగిరి ప్రాంతానికి మంచి గుర్తింపు తేవాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే క్రీడల్లో క్రికెట్ ప్రధానమైనది అన్నారు. క్రీడలు గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరి సూర్యం, నందనవనం గ్రామ యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

15న బొట్లగూడూరులో సంక్రాంతి ఆటలపోటీలు

పామూరు, జనవరి 12 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండంలోని పలు గ్రామాల్లో వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో సీజన్ - 8 పేరుతో 15 తేదీన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ. 3వేలు, తృతీయ బహుమతి రూ. 2 వేలు అందజేస్తామని తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి రూ, 3వేలు, ద్వితీయ బహుమతి రూ. 2 వేలు, తృతీయ బహుమతి రూ. 1వేయి రూపాయలు, పాల్గొన్న ప్రతిఒక్కరికి రూ. 5 వందల బహుమతి ఇస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను మదన్, సెల్ నెంబర్ 9346453121 కు సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. కాగా పామూరు పట్టణంలో టీడీపీ ఉగ్రన్న యూత్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్, వైసీపీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, డీవైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ఐక్యతకు ఆటలు అనే నినాదంతో పలు రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఫరూక్

బీమా కోసం పంటలు నమోదు చేయించుకోవాలి

ముండ్లమూరు, జనవరి 12 : మండలంలోని పలు గ్రామాల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ ఫిబ్రవరి 15వ తేదీ లోపు బీమా కోసం పంటలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. మారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హాజరైన రైతులను ఉద్దేశించి ఏవో మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి 28వ తేదీ వరకు తుది జాబితా మార్చి నెలలో రైతు భరోసా కేంద్రాల్లో పంటల నమోదు జాబితాను పొందు పరుస్తామని అన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర క్వింటా రూ. 7వేలుకు కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు విజయలక్ష్మి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

అంగన్‌వాడీల యూనియన్ నాయకులు వెల్లడి

ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ


కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కనిగిరి, జనవరి 12: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేంత వరకూ పోరాటం ఆగదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ క్లస్టర్ నాయకురాలు ఐనెంపూడి రాజ్యలక్ష్మీ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జరిగిన 32వ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలీ చాలని జీతాలతో అంగన్‌వాడీల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించటంతో పాటు ఉద్యోగోన్నతులు కల్పించి వేతనాలు పెంచుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సీఎం జగన్ మాట తప్పి చరిత్ర హీనుడయ్యారన్నారు. సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం సిగ్గు చేటు అన్నారు. ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చి నిరవధిక నిరాహార దీక్షలకు సిద్ధమౌతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వీసీ కేశవరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రజని, రాజేశ్వరి, సీత, రామసుబ్బులు, సౌందర్య, డీవైఎఫ్ఐ నాయకులు సరేంద్ర, జేవీవీ నాయకులు జీ శ్రీనివాసులు, ఐద్వా మహిళలు శాంతకుమారి, ప్రసన్న పాల్గొన్నారు.


దర్శి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బెదిరింపులకు భయపడం

దర్శి : న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని, బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఆందోళనల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట 32వ రోజు ధర్నా కొనసాగించారు. ధర్నాను ఉద్దేశించి కొండారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించి, సంజాయిషీ నోటీసులు ఇచ్చి విధుల్లో చేరాలని బెదిరించటం దారుణమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీల జీతాలను రూ.26వేలకు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి. రంగారావు, సందు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, యూనియన్ నాయకురాళ్లు నాగమణి, బాలమ్మ, సుజాత, సరోజ, ప్రశాంతి, విశ్వవాణి, దేవిభాయి, శివకుమారి, వెంకటరమణ, యశోద తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసురక్షను వినియోగించుకోవాలి


తాళ్లూరులో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాళ్లూరు, జనవరి 12 : ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి అన్నారు. బొద్దికూరపాడు గ్రామంలో గ్రామ సర్పంచ్ మందాశ్యాంసన్ ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వే జరిపివ్యాధి గ్రస్తులను గుర్తించి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి మెరుగైన చికిత్సల కోసం జిల్లా వైద్యశాలలకు పంపుతామన్నారు. ఈ సందర్భంగా 340 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ శ్రీకాంత్, ఎంపీటీసీ కొప్పుల బాలకోటయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, సంఘన సుబ్బారెడ్డి,సగిలి నాగేశ్వరరెడ్డి,పంచాయతీకార్యదర్శి షహనాజ్ బేగం, రిటైర్డ్ టీచర్ ఎస్. అంజిరెడ్డి,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురక్షలో 347 మందికి వైద్య పరీక్షలు

పామూరు : రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్ -2 వైద్యశిబిరాన్ని పట్టణంలోని 1వ గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 347 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు షేక్ రుబియ, గద్దె హేమసుధ. చెన్నుపాటి భరత్, కంటి డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లుతోపాటు ఆరోగ్య విస్తరణాధికారి ఎన్ బ్రహ్మానందం, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే చర్యలు


తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ రామానాయక్

పామూరు, జనవరి 12 : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటున్న దృష్ట్యా రోడ్డు పక్కన వ్యాపారాలు చేసేవారు ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించకుండా రోడ్డు మార్జిన్ దాటి రాకుండా నిర్వహించుకోవాలని సీఐ రామానాయక్, ఎస్ఐ కె. సురేష్‌లు హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్‌ను పరిశీలించి క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా రోడ్డు మార్జిన్‌లలో వ్యాపారాలు చేసుకొనే వారితో మాట్లాడారు. రోడ్డపై వాహనాలు నిలిపడం వలన ట్రాఫిక్ నిలిచిపోతున్నదని, అదేవిధంగా రోడ్లపై పార్శిల్ వాహనాలు పెట్టి సరుకులు దింపడం వలన ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతుందని, వ్యాపారులు, తోపుడు బండ్ల వారు సహకరించాలని లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు.

పవన్‌ను కలిసిన జనసేన మండల అధ్యక్షుడు ప్రసాద్


పవన్‌తో కూటాల ప్రసాద్

తాళ్లూరు, జనవరి 12: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మండల జనసేన అధ్యక్షుడు కూటాల ప్రసాద్ మంగళగిరిలోని జనసేన రాష్ట్రకార్యాలయంలో శుక్రవారం కలిశారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీకూటమి అభ్యర్థి భారీమెజారిటీతో విజయం సాధించేలా ప్రతి జనసైనికుడు కృషి చేయాలని అధినేత పవన్ కల్యాణ్ సూచించారని ప్రసాద్ తెలిపారు.

బూచేపల్లి అభిమానుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి అభిమానులు

దొనకొండ, జనవరి 12 : వైసీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నియమితులైన సందర్భంగా దొనకొండలో వైసీపీకి చెందిన పలువురు బూచేపల్లి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. వైసీపీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, దొనకొండ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారీ, దేవానంద్, ఉప సర్పంచ్‌పఠాన్‌ఇమ్రాన్‌ఖాన్ నాయకులు తమ్మనేని సుబ్బారెడ్డి, ముజాహిద్, గుడిపాటి నాసరయ్య మరికొందరు నాయకులు, కార్యకర్తలు భారీగా బాణ సంచాకాల్చి, వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేకు కట్ చేసి పంపిణీ చేశారు.

విజ్ఞానయాత్రలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం


దొనకొండ నుంచి శ్రీశైలం వెళ్తున్న గౌతమీ డిగ్రీ కాలేజీ విద్యార్థులు

దొనకొండ, జనవరి 12 : విజ్ఞాన, విహారయాత్రల వలన విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు స్వయంగా చూసి నేర్చుకోవటం వలన ఎక్కువగా గుర్తుంచుకునే అవకాశం ఉంటుందని స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పాల్ గోపి వివరించారు. శ్రీగౌతమీ విద్యాసంస్థ చైర్మన్ కె. గుండారెడ్డి ఆదేశాల మేరకు కాలేజీకి చెందిన విద్యార్థులను శుక్రవారం చారిత్రక ప్రదేశమైన శ్రీశైలం దేవస్థానం, శ్రీశైలం సమీపంలోని డ్యామ్ పరిసర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి వాటి ప్రాముఖ్యతలను క్లుప్తంగా వివరించామని కళాశాల అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు దేవదానం, విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


కబడ్డీ ఆడుతున్న వేముల, ఈదర జట్లు

ముండ్లమూరు, జనవరి 12 : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీనియర్స్ విభాగంలో కబడ్డీ పోటీలు జరిగాయి. పురుషుల విభాగంలో వేముల, ఈదర జట్లు తలపడగా ఈదర జట్టు విజయ కేతనం ఎగుర వేసింది. మహిళల విభాగంలో ఉమామహేశ్వర అగ్రహారం, పెద ఉల్లగల్లు జట్లు తల పడగా ఉమామహేశ్వర అగ్రహారం జట్టు విజయ కేతనం ఎగుర వేసింది. గెలుపొందిన క్రీడాకారులను ఎంపీడీవో బీ శంకరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు భావన్నారాయణ, రాముడు, ప్రసాదు, లలితాంబ తదితరులు ఉన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలో ఏ గ్రామంలోనైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ యూ వెంకట కృష్ణయ్య తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏ గ్రామంలోనైనా కోడిపందేలు జరుగుతున్నట్లుగా తెలిస్తే తన సెల్ నెంబరు 9121102164కు ఫోన్ చేయాలన్నారు.

టీఏవోగా సంగమేశ్వరరెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న సంగమేశ్వరరెడ్డి

దర్శి, జనవరి 12 : మండల సాంకేతిక వ్యవసాయాధికారిగా బి. సంఘమేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందటంతో ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. గతంలో ఆయన ఇక్కడ వ్యవసాయాధికారిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాంకేతిక పరమైన సలహాలు, సూచనలు అందించి నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

మిర్చికి తామర పురుగు, వైరస్ తెగులు


మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి కుసుమ

పామూరు, జనవరి 12 : మండలంలో సాగు చేసిన మిర్చి పంటకు తామర తెగులు ఆశించిందని ఉద్యాన అధికారిణి కె.కుసుమ తెలిపారు. మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో సాగులో ఉన్న మిరప పైరును శుక్రవారం ఆమె పరిశీలించారు. మిరప పైరుకు తామర తెగులు, వైరస్ ఎక్కువగా ఆశించిందన్నారు. ఈ తెగులు నివారణకు ఎకరానికి 20 చొప్పున పసుపు, బులుగు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని, వేపనూనెను 5 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవడం వలనపురుగులను గడ్డు దశలోనే నివారించవచ్చునన్నారు.అదేవిధంగా ఎసిఫేట్ పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు రూ.10వేలు అందజేత

తాళ్లూరు, జనవరి 12 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొద్దికూరపాడు వాసి చీమలదిన్నె యలమంద కుటుంబానికి వైఎస్సార్ భీమాపథకం కింద మట్టి ఖర్చులకుగాను రూ.10వేల రూపాయలు గ్రామసర్పంచ్ మందాశ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డిలు శుక్రవారం అందజేశారు.

పెండింగ్ విద్యుత్ బకాయిలపై స్పెషల్ డ్రైవ్


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడీఈ పిచ్చయ్య

ముండ్లమూరు, జనవరి 12 : మండలంలోని వివిధ గ్రామాల్లో పేరుకు పోయిన పెండింగ్ బకాయిలను స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూలు చేయాలని దర్శి డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఈ కే పిచ్చయ్య అన్నారు. ఆయన శుక్రవారం ముండ్లమూరు సబ్ స్టేషన్‌లో పెండింగ్ విద్యుత్ బకాయిల వసూళ్ళ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గృహ వినియోగ దారులు, వ్యవసాయ కనెక్షన్‌లు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. 1.30 కోట్ల మేర బకాయిలు పేరు కు పోయాయన్నారు. వాటిలో ఈ నెలాఖరు లోగా 50 శాతం మేర వసూలు చేయాలన్నారు. వరుసగా మూడు నెలలు విద్యుత్ బకాయిలు చెల్లించ కుండా ఉంటే కనెక్షన్‌ను తొలగించాలని ఏడీఈ సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం మండలంలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల జరుగుతు న్నాయన్నారు. ఈ సమావేశంలో లైన్‌మెన్‌లు పీఎస్ఆర్ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

నేడు డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో ఐ క్యాంపు రివ్యూ

కనిగిరి, జనవరి 12: స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో మెగా ఐక్యాంపు రివ్యూ జరుగుతుందని డాక్టర్ ఉగ్ర క్యాంపు కార్యాలయ వర్గాలు శుక్రవారం తెలిపాయి. జననీ చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అం ధత్వ నివారణ సంస్థ , శంకర కంటి ఆసుపత్రి సహకారంతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. డిసెంబరు 10వతేదీ నుంచి 13వ తేదీ వరకు కంటి ఆపరేషన్లు చేయించుకున్నవారు పాల్గొనాలని కోరారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి కంటి వైద్య పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ప్రజా
పరిచయ వేదిక
వృత్తిలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,
ప్రతి నిమిషం ప్రజాసేవకై పరితపిస్తూ..
ఎన్నో సందర్భాలలో పేద, బడుగు బలహీన
వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తూ...
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు IRS
(చిన్న బుజ్జి) గారు ప్రజలకు మరింత సేవ చేయాలనే
దృఢ సంకల్పంతో, ఎన్టీఆర్ గారి స్ఫూర్తి,
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
ఆశయ సాధనకై మన ముందుకు
వస్తున్న సందర్భముగా వారికి ఇవే మా
హృదయపూర్వక శుభాకాంక్షలు
అందరికీ
ఆత్మీయ ఆహ్వానము
నేడు
ది.13-01-2024
ఉదయం
10.00 గం.లకు
మన బాపట్లలోని
విలియం బూత్
జూనియర్ కళాశాల ప్రక్కన,
క్రిస్టియన్ భవన్
ఆవరణములో
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు
IRS (చిన్న బుజ్జి)
దేవతోటి సుందరయ్య
టిడిపి రాష్ట్ర యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి, చీరాల
దేవతోటి నాగరాజు
పర్చూరు నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
పంతాని మురళీధరరావు
రాష్ట్ర టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి, రేపల్లె
దేవతోటి నాగరాజు
బాపట్ల పార్లమెంట్ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
పెనుమాల డేవిడ్
బాపట్ల పార్లమెంటు టిడిపి యస్.సి.సెల్ అధికారప్రతినిధి
జంగం ప్రవీణ్
బాపట్ల పార్లమెంటు టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
చుక్కా కోటయ్య
రేపల్లె నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ అధ్యక్షులు
పల్లం సరోజనీ
టిడిపి బాపట్ల పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి
కూచిపూడి ఝాన్సీరాణి
టిడిపి బాపట్ల పార్లమెంటు కార్యదర్శి
జంగం రాజశేఖరరావు
విశ్రాంత సి.ఇ.ఓ. సంతరావూరు
జి.వి. దాగేశ్వరరావు
టిడిపి ఆఫీస్ ఇన్‌ఛార్జ్, రేపల్లె
వెంకట్రావు
పర్చూరు నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
ఇట్లు : బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు



వసూళ్లలో.. వెనుకంజి

- పురాల్లో పన్నులు 38.73 శాతమే
- పేరుకుపోతున్న ఆస్తి, నీటి పన్నులు
- రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు
- అధికారుల నిర్లక్ష్యంతో వసూలుకాని బకాయిలు
- వసూళ్లలో రాష్ట్రంలో వినుకొండ ప్రథమ, అద్దంకి ద్వితీయ స్థానం

పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తంమీద పన్నుల వసూళ్ల శాతం 38.73 శాతమని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఇక ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా మున్సిపాల్టీల్లోని అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని బకాయిలను చూస్తే తెలుస్తోంది. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నాయే కాని వాటి వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదు. అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో పన్నుల వసూళ్లలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగకపోతుండటంతో ఆ ప్రభావం ఉద్యోగుల జీతాలు, అభివృద్ధి పనులపై పడుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పన్నుల వసూళ్లను చూస్తే తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. మున్సిపాలిటీలకు ఇచ్చిన లక్ష్యాల మేర పన్ను వసూలు జరగడం లేదు. సిబ్బంది అలసత్వంతో వసూలు మందకొడిగా సాగుతోంది. ఆస్తి, నీటి, ఇతర పన్నులు రూ.449.49 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటి వరకు రూ.174.11 కోట్లు మాత్రమే వసూలు చేశారు. వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ, అద్దంకి మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలలోని మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను రూ.368.87 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.157.71 కోట్లు వసూలైనట్లు డీఎంఏ కార్యాలయ లెక్కలు తెలియజేస్తున్నాయి. పన్ను వసూలు శాతం 42.75గా నమోదైంది. నీటి పన్ను వసూలు కూడా నామ మాత్రంగా ఉంది. తాగునీటి పన్ను రూ.80.62 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.16.40 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. నీటి పన్ను వసూలు 20.34 శాతంగా ఉంది. ఉన్నతాధికారులు పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్నా మున్సిపాలిటీలలో అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగు తున్నది. పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా వారి మొర మున్సిపాలిటీ అధికారులు ఆలకించే పరిస్థితి లేదు. మార్చి ఆఖరు కల్లా సుమారు రూ.211.16 కోట్లు ఆస్తి, తాగునీటి పన్ను రూ.64.22 వసూలు చేయాల్సి ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో దాదాపు రూ.20.36 కోట్లు ప్రభుత్వ సంస్థల భవనాలు, కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకు పోయాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.3.47 కోట్లు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అన్ని పురపాలక సంఘాలలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి.





జీతాలు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

నిధుల లేమితో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్లు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుందనేది బహిరంగ రహస్యం. అయినా అటు అధికారులు ఇటు పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం కూడా మున్సిపాలిటీలను గాలికివదిలేసిందని అందువల్లే ప్రధాన ఆదాయవనరైన పన్నుల వసూళ్లలో వెనుకంజలో ఉన్నట్లు అర్థమవుతుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిలిపి వేస్తున్నారు.

పన్నుల వసూళ్లలో అక్రమాలు..

ఆస్తి, తాగునీటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు ఇతర పన్నుల వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మున్సిపాల్టీల్లో ప్రధానంగా ప్రకటనల పన్ను పక్కదారి పడుతోంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, వాటి పన్నుల వసూళ్లకు పొంతన ఉండటంలేదు. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సంబంధించిన పన్నుల వసూలులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు పన్నుల ఆదాయాన్ని పెంచుకోవడంలో అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్నులకు సంబంధించి ఏటా ఒక్కో మున్సిపాలిటీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నది. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేక పోవడం వల్లే ఈ ఆదాయాన్ని మున్సిపాలిటీలు రాబట్టుకోలేకపోతున్నాయి.

మున్సిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూళ్లు ఇలా...

మున్సిపాలిటీ	వసూళ్ల లక్ష్యం రూ.కోట్లలో	వసూలు రూ.కోట్లలో	శాతం
పల్నాడు జిల్లా			
నరసరావుపేట	14.83	6.99	47.10
చిలకలూరిపేట	14.14	3.84	27.20
వినుకొండ	4.26	3.75	88.20
సత్తెనపల్లి	6.40	2.92	45.70
మాచర్ల	4.90	2.37	48.50
పిడుగురాళ్ల	4.74	2.66	56.10
దాచేపల్లి	1.78	1.17	65.90
గురజాల	1.29	0.59	46.00
బాపట్ల జిల్లా			
రేపల్లె	4.76	2.83	59.40
బాపట	8.14	3.97	48.80
అద్దంకి	3.78	3.05	80.90
చీరాల	10.30	6.73	65.40
గుంటూరు జిల్లా			
గుంటూరు కార్పొరేషన్	231.64	80.03	34.50
పొన్నూరు	5.07	2.95	58.20
మంగళగిరి, తాడేపల్లి	30.62	19.30	62.89
తెనాలి	22.22	11.59	52.10

సంక్రాంతి సిరులు వెల్లివిరియాలి

- కలెక్టరేట్‌లో అట్టహాసంగా సంబరాలు
- ఉద్యోగులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

బాపట్ల, జనవరి 12: సంక్రాంతి పండుగతో ప్రతి ఇంట సిరులు వెల్లివిరియాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలియ జెప్పేలా రోలు, తిరగలి, రోకలి, గోబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దుల ప్రదర్శన, డప్పు కళాకారుల నృత్యాలు, మేళతాళాలతో కలెక్టరేట్ ప్రాంగణం మారుమోగింది. ఉద్యోగులు, అధికారులతో కలిసి కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, వికసిత్‌భారత్ ప్రత్యేకాధికారి రాహుల్‌మాలిక్, ఎమ్మెల్యే కోన రఘుపతి రమాదేవి దంపతులు, ఇతర అధికారులు సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై అధికారులు ఊరేగింపుగా ప్రాంగణం వద్దకు వచ్చారు. పొంగళ్లు పెట్టి అందరికీ వడ్డించారు. చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. టగ్గాఫ్‌వార్‌లో కలెక్టర్ జట్టు విజేతగా నిలిచింది. గాలిపటాలు ఎగురవేశారు. ముగ్గులు ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్, సంయుక్త కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. రైతులు క్షేమంగా ఉంటే ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. ఈ వేడుకల్లో ఏఎస్పీ మహేష్, డీఆర్‌వో వెంకటరమణ, ఏవో గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భోగిమంటలు వేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా,ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు



పొంగలి పొంగిస్తున్న మహిళా అధికారులు, నాయకులు



తిరగలి విసురుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు



సంక్రాంతి సంబరాల్లో భాగంగా గంగిరెద్దు విన్యాసం

బరులు.. సిద్ధం

- గ్రామాల్లో పందాలకు సై
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఏర్పాట్లు
- కత్తులు దూసేందుకు సిద్ధమవుతోన్న కోళ్లు
- పోలీసు హెచ్చరికలను ఖాతరు చేయని వైనం



వేమూరు మండలం వరహాపురం వద్ద కోడి పందాల కోసం ఏర్పాటు చేసిన బరి



చుండూరు మండలం వేటపాలెంలో బరి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



రేపల్లె వద్ద ఏర్పాటు చేసిన బరి వద్ద ఉన్న పోలీసులు

కొల్లూరు, అద్దంకి/బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఇంకా సమయం ఉన్నా.. కోడి పందాలకు బరులు సిద్ధమవుతున్నాయి. కత్తులతో కోళ్లు.. పందాలకు జూదరులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారి భారీగానే కోడి పందాలు జరిగేలా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పందాలకు అనుమతి లేదని పోలీసుల హెచ్చరికలు ఖాతరు చేయడంలేదు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో కోడి పందాలను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పాలకపార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ తంతు జరుగుతుంది. వేమూరు మండలం వరహాపురం పరిధిలో కోడి పందాలు వేసేందుకు బరి దాదాపు సిద్ధమైంది. కొల్లూరు మండలం పెసర్లంక సమీపంలో బరిని ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో పెదపులివర్రు, ఓలేరు-పేటేరు మధ్యలోని జాతీయ రహదారి వెంబడి భారీ స్థాయిలో బరికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చుండూరు మండలం వేటపాలెంలో కోడి పందాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. బరుల సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసినా వారిని పట్టించుకోకుండా ట్రాక్టర్లతో భూమి చదును, బారీకేడ్లు తదితర పనుల్లో నిర్వాహకులు ఉన్నారు. వేమూరు పరిధిలో మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున ఆశీస్సులతో ఆ పార్టీ నాయకులు కోడి పందాలకు బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు సర్కిల్ పరిధిలో కోడి పందాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. నిర్వాహకులు కొన్నిప్రదేశాలను ఎంపిక చేసుకుని జూదరులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే బాపట్ల జిల్లా ఎస్పీ జిందాల్ గురువారం డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడా కోడి పందాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా కోడి పందాలు జరిగినట్లు సమాచారం వస్తే ఆ పరిధిలో ఉన్న ఎస్‌ఐలను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

హరిదాసు.. ఓ జ్ఞాపకం

- కనుమరుగైపోయిన సనాతన ఆచారం
- వినపడని హరిలో రంగ హరి సంకీర్తన



గుంటూరు సిటీ, జనవరి 12: చేతిలో చిడతలు, కాళ్లకు గజ్జెలు, పట్టు పంచె ధోవతి, నెత్తిన గుండ్రటి రాగిపాత్ర నోటి నిండా నారాయణుని నామ సంకీర్తనతో పొద్దు పొడవక ముందే తరతమ భేదం లేకుండా ఇంటింటికి వచ్చే వారే హరిదాసులు. ధనుర్మాసం ఆరంభం కాగానే హరిదాసు ఇంటి ముందుకు వచ్చాడంటే సంక్రాంతి దగ్గర్లో ఉన్నట్లు లెక్క. వాళ్లకి కుల మతాలతో పనిలేదు. ధనికులు దరిద్రులన్న తేడా లేదు. హరినామ స్మరణ చేసే వారిని అనుగ్రహించడానికి హరిదాసు రూపంలో వైకుంఠం నుంచి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే వస్తాడన్నది నమ్మకం. హరిదాసు వట్టిచేతులతో వెళ్లిపోతే ఆ ఇంటికి అరిష్టమని కొంతమంది నమ్మకం. అందుకే ఊరిలోకి హరిదాసుడు వస్తున్నాడంటే ఇంటి యజమానురాలు ధాన్యంతో గుమ్మంలో సిద్ధంగా ఉంటారు. ఒక ముక్క లో చెప్పాలంటే హరిదాసు మన సంస్కృతి లో భాగం. సంక్రాంతి పండుగలో భాగం. చిన్నప్పటి మన జ్ఞాపకం. ఇప్పుడా హరిదాసు కనపడటం లేదు. హరిలో రంగ హరి అంటూ వినిపించే హరినామ సంకీర్తన వినపడటం లేదు. మొత్తంగా హరిదాసు జాడేలేదు. మారిన సమాజ స్థితిగతులు శతాబ్దాల నాటి హరిదాసు వైభవాన్ని మాయం చేశాయి. తాతలు, తండ్రుల తరం వెళ్లిపోయాక వారి పిల్లలు హరిదాసు కట్టు బొట్టు పెట్టేందుకు తటపటాయిస్తున్నారు. కొన్ని చోట్ల తగినంత ఆదరణ లేకపోవడం, మరికొన్ని చోట్ల కొద్దిగా చిన్న చూపు చూస్తూ ఉండటంతో తండ్రి వారసత్వంగా హరిదాసు వృత్తిని కొనసాగించేందుకు వారి పిల్లలు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో హరిదాసు ఓ జ్ఞాపకంగా మారాడు. పాత సినిమాల్లో.. పుస్తకాల్లో.. కథల్లో.. ఓ స్మృతిగా కనిపిస్తున్నాడు.

ఉదయ్‌తో విశాఖకి కనెక్టివిటీ

- జెండా ఊపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు
- గుంటూరు రైల్వేస్టేషన్‌లో అట్టహాసంగా ప్రారంభోత్సవం

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉదయ్ ఏసీ డబుల్ డెక్కర్ రైలుతో గుంటూరు - విశాఖపట్టణం మధ్య రైలు కనెక్టివిటీ మరింత పెరిగిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. వారంలో ఐదు రోజులు నడిచే ఈ రైలు సమయపట్టిక ప్రయాణికులకు ఎంతో సౌకర్యవం తంగా ఉంటుందన్నారు. వేకువజాము న విశాఖలో బయలుదేరితే మధ్యాహ్నానికి గుంటూరుకు చేరుకోవచ్చని, అలానే గుంటూ రులో సాయంత్రం రైలు ఎక్కితే రాత్రికి విశాఖ చేరవచ్చన్నారు. శుక్రవారం సాయంత్రం గుంటూ రు రైల్వేస్టేషన్‌లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు ప్రారంభోత్సవం జరిగింది. రేణిగుంటలో నంద్యాల ప్యాసింజర్, నరసపూర్‌లో అమరావతి ఎక్స్‌ప్రెస్‌లను వీడియో లింకు ద్వారా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి కిషన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరైన రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రయాణికులను ఉద్దేశించి ప్రసంగిం చారు. ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ బోగీలతో పాటు నాన్ ఏసీ కోచ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలానే కర్ణాటక ప్రాంతానికి కోస్తాంధ్రతో కనెక్టివి టీ పెంచేందుకు హుబ్లీ - విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్‌కు పొడిగించామన్నారు. నంద్యాల ప్రాంత ప్రయాణికులకు తిరుపతి కనెక్టివిటీని పెంచేందుకు నంద్యాల - కడప రైలుని రేణిగుంటకు పొడిగించామని చెప్పారు. ఈ మూడు రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రైల్వేలో ప్రధాని మోదీ నేతృత్వంలో అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టడం అభినందనీయ మన్నారు. గుంటూరులో పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు ఆమోదం తెలపాలని కోరారు. అలానే రైల్వేస్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్‌రోడ్లను రైల్వే నిర్మించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం ఎం రామకృష్ణ, బీజేపీ మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్‌నారా యణ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కి సిగ్నల్ ఇస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సీఎం కార్యదర్శిని కలిసిన ఆమంచి

చీరాల, జనవరి 12: వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిశారు. వారివురి మధ్య కొంతసేపు ఏకాంత చర్చలు జరిగినట్లు సమాచారం. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై వారి మధ్య సంభాషణ జరిగినట్లు తెలిసింది. అనుచరుల్లో కొందరు ముఖ్యులు మాత్రం ఆమంచి వైసీపీ తరఫున పర్చూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని, అందులో ఎలాంటి సందేహం లేదని, తమకు తెలిసినంత వరకు అధిష్ఠాన నిర్ణయం కూడా అదేనని స్పష్టం చేస్తున్నారు. అయితే, ఆమంచి సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డిని కలుయుకున్న పర్చూరు నియోజకవర్గంలోని ఆమంచి వ్యతిరేక వర్గంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనుకూలవర్గం ఆమంచే అభ్యర్థి బలంగా నమ్ముతున్నారు.

నేటి నుంచి వీరన్నపాలెంలో నాటిక పోటీలు

వీరన్నపాలెం(పర్చూరు), జనవరి 12: మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో 8వ జాతీయస్థాయి నాటిక పోటీలు శనివారం ప్రారంభమవుతున్నాయని కళానికేతన్ కళాపరిషత్ నిర్వాహకుడు కొల్లా శ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 16 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు గొనసపూడిలో ముగ్గుల పోటీలు

చినగంజాం, జనవరి 12: మండలంలోని గొనసపూడిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలవరపు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ఎమ్మెల్యే సాంబశివరావు చేతులమీదుగా నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తివివరాలకు 9849083710, 97043 23508 నెంబర్లను సంప్రదించాలని పోలవరపు కోరారు.

అబద్ధపు హామీలతో నయవంచన

- మాట తప్పటం, మడమ తిప్పటం జగన్మోహన్‌రెడ్డి నైజం
- వచ్చేది టీడీపీ ప్రభుత్వమే!
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


ముక్త్యేశ్వరం గ్రామ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, జనవరి 12: ఒక్క చాన్స్ పేరిట అబద్ధ హామీలతో వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. శుక్రవారం మార్టూరు మండలం జొన్నతాళి వద్ద గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం ముక్త్యేశ్వరం, సూరేపల్లి, రామాంజనేయపురం గ్రామాలకు చెందిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు సమిష్టిగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసేలా ప్రణాళికతో రూపొందించిన సూపర్ సిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ పేజీ నేస్తం కార్యక్రమంలో భాగంగా 60 మందిని ఒక వార్డుగా చేసి వారి వివరాలను సేకరిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలను తనిఖీ చేస్తూ ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే అధికారులకు తెలియపరచాలన్నారు.

అనంతరం ఆయన గ్రామాలలో గతంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పట్టించుకోని ప్రజా సమస్యల గురించి నేతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైజం మాట తప్పటం, మడమ తిప్పటం మాత్రమేనని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పారన్నారు. ఉద్యోగులకు ప్రతి సోమవారం పోలవరం మార్చి 72 శాతం పనులు పూర్తి చేయిస్తే, జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే రీవర్స్ టెండర్లతో గ్రామాలు ఆడి కమీషన్ల కక్కుర్తితో జాతీయ ప్రాజెక్టును సర్వనాశనం చేసి రైతులకు తీవ్ర ద్రోహం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికలలో ఓటమి చెందుతామని భయపడి ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు ఉపాధ్యాయుల ఆశలకు, ఆంగన్ వాడీ కార్యకర్తలకు జీతాలు పెంపుదల చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. కొత్త పింఛను ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ప్రభుత్వ హామీల మార్చి పరిశ్రమలను ప్రజల్లో జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండేటి ఇజ్రాయల్, నేతలు ఆట్లూరి నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, సింగరకొండ, బైలడుగు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుగ్రామాల నేతలతో సమీక్ష

అద్దంకి, జనవరి 12: నియోజకవర్గంలోని పలు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం సమీక్ష నిర్వహించనున్నారు. మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే సమీక్షలకు బల్లికురవ మండలం కొండాయపాలెం, అద్దంకి మండలం తిమ్మాయపాలెం, కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజెంట్లు, పేజీ నేస్తం సభ్యులు హాజరుకానున్నారు.

నోటీసులకు బెదరం.. సమ్మెను కొనసాగిస్తాం

- ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీల ధ్వజం

ఇంకొల్లు, జనవరి 12: తమ సమస్యలు పరిష్కరించకుండా ఎన్ని నోటీసులు ఇచ్చినా బెదిరేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. ఇంకొల్లులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం వెంటనే తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగుల్ల వెంకట్రావు, శ్రీదేవి, నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి, రమాదేవి, వెంకటరమణ, సుజాత, దేవమ్మ, రేవతి, సుబ్బాయమ్మ, సులోచన పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేతల సంఘీభావం

అద్దంకిటౌన్, జనవరి 12: ఎన్నికలకు ముందు సీఎం జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.బాబూరావు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ధర్నా కార్యక్రమానికి యూటీఎఫ్ అద్దంకి మండల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, పూర్ణచంద్రరావు, తంగిరాల వెంకటేశ్వర్లు, జి.శారద, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట 64 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, అంజలి, రజని, గంగ, సునీ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గం

చినగంజాం, జనవరి 12: డిమాండ్ల సాధనకు 32 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేస్తోంటే, ప్రభుత్వం వారిపై ఎస్మా ప్రయోగించి నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ధ్వజమెత్తారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చీరాలటౌన్: ప్రభువా జగనన్న మనసు మార్చు.. మా సమస్యల గుర్తించేలా మంచి మనసు ప్రసాదించమని అంగన్‌వాడీలు శుక్రవారం ప్రార్థనలు చేశారు. గతకొంత కాలంగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటక రంగానికి ఊపిరిపోస్తున్న కళాపరిషత్‌లు

- నటుడు, దర్శకుడు శివనారాయణ
- ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు


కన్నీటి కథ నాటికలోని ఓ సన్నివేశం

యద్దనపూడి(మార్టూరు), జనవరి 12: మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడానికి కళాపరిషత్‌లు దిక్సూచిలాగా ఉంటాయని నటుడు, దర్శకుడు మల్లాది శివనారాయణ అన్నారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో రెండో రోజు శుక్రవారం రాత్రి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్లాది శివనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభా వేదికపైకి కందిమళ్ల సాంబశివరావు అతిథులను ఆహ్వానించారు. సభకు కళాపరిషత్ అధ్యక్షుడు గుడే పాండురంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి మల్లాది శివనారాయణ మాట్లాడుతూ నృత్యంద సంస్థల ఆర్థికంగా పేద ప్రజానీకానికి తోడ్పాటు అందిస్తాయన్నారు. కళాకారులు మానసికంగా ప్రజల ఆలోచన విధానంలో మార్పునకు ప్రేరణగా నిలుస్తారన్నారు. అనంతరం శివనారాయణను కళాపరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాటకరంగ విశ్లేషకులు అంజలి మురళీకృష్ణ, ముత్తవరపు సురేష్‌బాబు, గుడే తార కరమారావు, తదితరులు పాల్గొన్నారు.


నటుడు, దర్శకుడు మల్లాది శివనారాయణను సత్కరిస్తున్న కళా పరిషత్ సభ్యులు

గ్రామాలలో వ్యవసాయంలో రైతులు పడుతున్న పాట్లను గుర్తుకు తెచ్చాయి. అనంతరం కాంజలి హైదరాబాదు వారు ప్రదర్శించిన రైతే రాజు నాటిక కూడా ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కంప్యూటీకరణ పై ప్రపంచం పయనిస్తున్న సమయంలో కూడా రైతుకు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధరను నిర్ణయించుకోలేని పరిస్థితులో ఉన్నాడని, ప్రభుత్వాలు మారినా రైతుల సమస్యలు మారలేదంటూ చేసిన ప్రదర్శన ఆకట్టుకున్నది.

చివరగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారు ప్రదర్శించిన జరుగుతున్న కథ నాటికను తిలకించిన ప్రేక్షకుల హృదయాలు బరువెక్కాయి. వయస్సులో ఉన్నంతకాలం సంపాదించిన సొమ్మును పిల్లల కోసం ఖర్చుపెట్టి వృద్ధాప్యంలో అవసరానికి డబ్బులు లేక పిల్లలను డబ్బులు కోసం చేయిచాపడం తల్లిదండ్రులకు ఎంతో ఇబ్బందికరమని, ఎంతోకొంత సొమ్మును తమ వృద్ధాప్యం కోసం తల్లిదండ్రులు దాచుకోవాలని కళాకారులు చేసిన ప్రదర్శన దాదాపుగా ప్రతి కుటుంబంలో మనకు కనపడుతున్న సన్నివేశాలేనని ప్రేక్షకులు ద్రంచుకున్నారు.

ఆలోచింపచేసిన నాటికల ఇతి వృత్తాలు

శుక్రవారం రాత్రి తొలి ప్రదర్శనగా మిత్రా క్రియేషన్స్ వారు కన్నీటి కథ నాటికను ప్రదర్శించారు. వ్యవసాయం చేసే రైతు కుటుంబాలు ప్రకృతి అనుకూలించకపోవడం, నీటి కొరత, విత్తనాల కొరత ఇంకా తదితర సమస్యలను ఎదుర్కొని ఏ విధంగా తీరునమ కళాకారులు చక్కగా ప్రదర్శించారు. ఈ నాటికను తిలకిస్తున్నంతసేపు ప్రేక్షకులకు రోజూ

నేడు ప్రదర్శించనున్న నాటికలు

శనివారం రాత్రి మూడు నాటికలను ప్రదర్శించనున్నారు. తెలుగు కళాసమితి విశాఖ పట్టణం వారితో నిశబ్దమా నీకుదిరంత, ఉషోదయ కళానికేతన్ కట్టపాడు వారితో ప్రణాళిక, సుభశ్రీ క్రియేషన్స్ చిలకలూరిపేట వారిచే మిణుగురు వెలుగులు నాటికలను ప్రదర్శిస్తారు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు


మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అద్దంకి, జనవరి 12: మంచినీటి పైప్‌లైన్ లీకులకు మున్సిపల్ సిబ్బంది మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో 'లీకుల అరికట్టేదెవ్వరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని భవాని సెంటర్‌లో మెయిన్ పైప్‌లైన్ లీకు అవుతుండటంతో నీటి విడుదల జరిగిన సమయంలో వృథాగా పోతుంది. దీంతో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది పైప్‌లైన్ లీకులకు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఒకచోట ఉన్న లీక్‌కు మరమ్మతులు చేసినప్పటికీ ఇంకా లీకు అవుతుంది. భవాని సెంటర్‌లో మెయిన్ పైప్ లైన్ నామ్ రోడ్డును క్రాస్ చేస్తూ ఉండటంతో ఎక్కడ నుంచి లీకులు వస్తున్నాయన్న విషయం గుర్తించటం కష్టంగా మారింది. పూర్తిస్థాయిలో మరమ్మతులకు మరో రెండురోజులు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

పర్చూరు రోటరీ క్లబ్ సేవలకు ప్రశంసలు

పర్చూరు, జనవరి 12: పర్చూరు సెంట్రల్ రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని 3150 రోటరీ గవర్నర్ భూపతిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పర్చూరు రోటరీ క్లబ్‌ను ఆయన సందర్శించారు. రోటరీ గంగ ద్వారా నిర్వహిస్తున్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు పర్చూరు రోటరీ క్లబ్ మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటర్నేషనల్ రోటరీ నిధులు నుండి గ్రాంట్ రూపంలో అందజేస్తామన్నారు. జిల్లాలో మరి ఎక్కడ లేనివిధంగా రోటరీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల ద్వారా మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించటం గొప్పించదగ్గ విషయమన్నారు. అనంతరం ఉప్పుటూరు గ్రామం పంచాయతీకి చెత్తను తరలించేందుకు రిక్షాను అందజేశారు. కార్యక్రమంలో సహాయ గవర్నర్ ఎం.సుధీర్ కుమార్, క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి వంటి నదానందరెడ్డి, సీనియర్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి

చీరాల, జనవరి 12: స్వామి వివేకానంద మాటలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి ప్రతినిధి సర్వెశెట్టి సుబ్బరామయ్య, డాక్టర్ పీవీ ప్రసాద్, ఆర్‌పీఎఫ్ ఎఎస్‌ఐ రమేష్, టి.చంద్రశేఖర్, ఎం.సుబ్బారావు, పిరామారావు, జి.హరిప్రసాద్, టీడీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద 162వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నంద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, జనసైనికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వివేకానందుని ఆశయాలను నాయకులు, జనసైనికులు ఆదర్శంగా తీసుకొని గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి ఆదుసుమల్లి హరిబాబు, తేలు అశోకచక్రవర్తి, గొల్లపూడి లక్ష్మీనారాయణ, పూల నాగులు, నాగిరెడ్డి వీరాంజనేయులు, మస్తం రాంబాబురెడ్డి, కేసిన బాజీస్వామి, ఆరిగ తిరుపతిరావు, సంద విజయ్, బొల్లేపల్లి తిరుపతిరావు, కమ్మెల వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్: స్థానిక రోటరీ క్లబ్ సింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ కార్యాలయంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్య, కార్యదర్శులు చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య కోశాధికారి భువనేశ్వరి, సందిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా శుక్రవారం మార్టూరులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, జాష్టి సాంబశివరావు, సయ్యద్ కరిముల్లా, తొట్టెంపూడి భుజంగరావు, తాళ్లూరి సాంబశివరావు, ముప్పా సాంబయ్య, సెట్ సుబాని, షేక్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకోవాలి


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం

వేటపాలెం(చీరాల), జనవరి 12: ప్రభుత్వ చేయూతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. వేటపాలెం మండలం ఆక్యాయపాలెం పంచాయతీలో రూ.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బలరాం శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గత నా లుగున్నరేళ్లలో రూ.5.42 కోట్లు వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబం ధించిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, పీఆర్ డీఈఈ శేషయ్య, ఏవో కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

చీరాల, జనవరి 12: స్థానిక కుందేరు సమీపంలో నిర్మిస్తున్న చిన్నపిల్లల పార్కు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదేశించారు. పార్కు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్కుల వల్ల నాణ్యతను పాటిస్తూ, వే గంగా పూర్తిచేయాలన్నారు. పార్కు పూర్తయితే క్రీడాపిల్లల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ శేషయ్య, పంచాయతీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారులకు సన్మానం


నూతనంగా ఎంపికయిన న్యాయాధికారులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రెహానా

చీరాలటౌన్, జనవరి 12: చీరాల బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయమూర్తులుగా ఎంపికయ్యారు. పాలకొల్లు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పి.లక్ష్మీలావణ్య, తిరువూరు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఎ.సింధూర ఎంపికయ్యారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రెహానా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభం


పోటీలో బండ లాగుతున్న హైదరాబాద్ ఎడ్లు

అన్నంబొట్లవారి పాలెం(పర్చూరు), జనవరి 12: ఒంగోలు జాతి ఎడ్ల పోటీలకు గద్దకరరాణివారి ఎంటర్‌టెయిన్ గ్రూప్ కంపెనీస్ ప్రతినిధి మానం పాటి రమేష్ బాబు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో 36వ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మానంపాటి మాట్లాడుతూ జాతీయస్థాయిలో పోటీలు ఏర్పాటుచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. తొలిరోజు జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 8 జతల ఎడ్లు తలపడ్డాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు, మర్రి నాగేశ్వరరావు తెలిపారు. తొలుత బరిలోకి దిగిన ఆర్‌ఆర్ బుల్స్ హైదరాబాద్ ఎడ్ల జత నిర్ణీత సమయం ముగిసే సరికి 3302.10 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, ఎర్రగొండపాలెం గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ కార్తికేయరెడ్డి గిత్తలు 2549 అడుగులు, గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సంపతి శ్రీజ ఎడ్లు 2409.3 అడుగుల దూరం లాగాయి.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

అద్దంకి, జనవరి 12: భార్యను హత్యచేసిన భర్త పోలకం రాజశేఖర్‌రెడ్డిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలవకూరులో రాజ్యలక్ష్మిని భర్త రాజశేఖర్‌రెడ్డి రోకలిబండతో దాడిచేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త రాజశేఖర్‌రెడ్డిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ పోటీలు

- విజయం సాధించిన హైదరాబాద్, తిరుపతి జట్లు


మేదరమెట్ల: హైదరాబాద్, బెంగళూరు మధ్య జరుగుతున్న పోటీ

మేదరమెట్ల, జనవరి 12: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీమరాల సంక్రాంతి కప్ 2024 పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీలో ప్రసాద్ జెడ్ స్పోర్ట్ హైదరాబాద్, తండర్ బోల్ట్ తిరుపతి జట్లు విజయం సాధించాయి. మొదట మెగా వారియర్స్ విజయవాడ, తండర్ బోల్ట్ తిరుపతి మధ్య జరిగిన జరిగిన పోటీలో టాస్ గెలిచి తిరుపతి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు 18.2 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తిరుపతి జట్టు 9.2 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి, 108 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ జట్టులోని దినేష్‌కుమార్ 28 బంతులలో 7 ఫోర్లు, 5 సిక్సులతో 68 పరుగులు సాధించి నాట్‌అవుట్‌గా నిలిచాడు. తిరుపతి బౌలర్ ప్రకాష్‌రెడ్డి 4ఓవర్లలో 11 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు.

సాయంత్రం జరిగిన పోటీలో ప్రసాద్ జెడ్ లెవెన్ హైదరాబాద్, లైన్స్ క్రికెట్ క్లబ్ బెంగళూరు జట్ల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన లైన్స్ క్రికెట్ క్లబ్ బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. బెంగళూరు జట్టు చివరిలో వికెట్లు కోల్పోవడంతో లక్ష్యాన్ని చేదించలేకపోయింది. నాలుగు పరుగుల తేడాతో ప్రసాద్ జెడ్ లెవెన్ హైదరాబాద్ విజయం సాధించింది.

శనివారం ఉదయం శ్రీ సీసీ చెన్నై, వైట్ ఫీల్డ్ క్రికెట్ అకాడమీ బెంగళూరు జట్ల మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం ఆర్వేసీసీ లెవెన్ హైదరాబాద్, జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్ల మధ్య పోటీ జరుగుతుందని ఆర్ఎస్‌సీఏ చైర్మన్ కారుసాల నాగేశ్వరరావు(బాబు) తెలిపారు.

ఆసక్తికరంగా క్రికెట్ పోటీలు

పంగులూరు, జనవరి 12: మండలంలోని కొండమంజులూరు గ్రామంలో జాతీయస్థాయి క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో సీసీ కేరళ జట్టుపై టాస్ గెలిచిన గుజరాత్ లైన్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్ చేపట్టిన కేరళ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఈ జట్టులో సదన్ 48 బంతులలో 70 పరుగులు చేశాడు. 174 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ లైన్స్ 7 వికెట్లు కోల్పోయి 127 పరుగులకు ఆలౌట్ అయింది. కేరళ జట్టు 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన సిరి హస్పటల్స్ ఒంగోలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్ చేపట్టిన లెవెన్ బ్రదర్స్ కామారెడ్డి జట్టు 18 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌట్ అయింది. 140 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సిరి హస్పటల్స్, ఒంగోలు 4 బంతులు మిగిలివుండగానే 119 పరుగులకు ఆలౌట్ అయింది. ఒంగోలు జట్టుపై కామారెడ్డి జట్టు 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఒంగోలు జట్టులోని బౌలర్ వంశీ 16వ ఓవర్‌లో 3 వికెట్లు తీసుకోవడం విశేషం. కామారెడ్డి జట్టు క్రీడాకారుడు జీవానంద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దీపక్, శ్రీనివాసనాయక్‌లు వ్యవహరించారు.


పంగులూరు: క్రికెట్ పోటీలలో తలపడుతున్న సిరి హస్పటల్స్ ఒంగోలు, లెవెన్ బ్రదర్స్ కామారెడ్డి జట్లు

శనివారం ఉదయం విక్కీలు లీతాస్ శ్రీకాకుళం, ఎన్ఎస్ఎంటీ తమిళనాడు జట్లు, సాయంత్రం ఎంఆర్‌సీసీ చెన్నై, మెగా లెవెన్ విజయవాడజట్లు పోటీపడతాయని కేసీసీ చైర్మన్ కరణం స్వామి తెలిపారు.

గ్రామాల్లో సంకల్ప యాత్రలు

పంగులూరు, జనవరి 12: మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు గ్రామాలలో వికసిత్‌భారత్ సంకల్పయాత్ర సభలు నిర్వహించారు. శుక్రవారం సర్పంచ్‌లు మద్దినేని పార్వతమ్మ, పెంట్యాల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో ఉజ్వల యోజన, ఆయుష్మాన్‌భారత్, జీవన్ బీమా యోజనలతో పాటు, కేంద్ర ప్రభుత్వం మహిళలు, యువత ఉపాధికోసం అమలు చేస్తున్న పలుపథకాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. అర్హులైన కొందరికి ఉచిత వైద్య సదుపాయం పొందేందుకు ఉపకరించే ఆయుష్మాన్‌భారత్ కార్డులను అందజేశారు.

కార్యక్రమంలో సెంట్రల్ కోఆర్డినేటర్ పోలవరపు అనుప్రసాద్, గొల్లపాటి విజయకుమార్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వంశీకృష్ణ, ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ కొండ, బ్యాంక్ మేనేజర్ దాసరి అనిల్, బీజేపీ ప్రతినిధి కొల్లి కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ రవి, బి.రాంబాబు, కార్యదర్శి వందనం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేదరమెట్ల, జనవరి 12: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. శుక్రవారం మేదరమెట్ల బైపాస్‌లో ఇంకొల్లు మండలం పావులూరుకు చెందిన గుంజి వీరయ్య(78) ఒంగోలు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపు తప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మేదరమెట్ల ఎస్‌ఐ నాగశివారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రేపు తెలుగుయువత ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

అద్దంకి, జనవరి 12: తెలుగుయువత ఆధ్వర్యంలో పట్టణంలోని 5వ వార్డులో ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు పిల్లలకు గేమ్స్, మధ్యాహ్నం 3 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగుయువత అద్దంకి పట్టణ అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు తెలిపారు. ముగ్గుల పోటీ లలో పాల్గొనదలిచినవారు 9398486697, 8008447275 నెంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



సోమశిలలో 30.983 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 14 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలకు గాను 30.983 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు



ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డ్యామేజీ రిపేర్స్) పనుల బాగోతం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వరదల కారణంగా దెబ్బతిన్న కాలువలు, చెరువులను బాగు చేయకుండానే చేసినట్లుగా చూపించి బిల్లులు చేసుకున్నారని మొదటి నుంచీ వెల్లువెత్తుతున్న ఆరోపణలకు ఇటీవల వెలుగుచూస్తున్న ఘటనలు బలాన్ని చేకూరుస్తున్నాయి. నిన్న ఉదయగిరి, నేడు సంగం మండలాల్లో ఎఫ్‌డీఆర్ ముసుగులో చేసిన దోపిడీ బట్టబయలైంది. అసలు వరదలకు దెబ్బతినని పనులు కూడా ఎఫ్‌డీఆర్ కింద చేర్చి కలెక్టర్ నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. పనులు చేయాల్సిన అవసరం లేకపోయినా చేసినట్లుగా చూపించి బిల్లులు స్వాహా చేశారు. ఈ తతంగంలో ఇరిగేషన్ సిబ్బంది, అధికార పార్టీ నేతలు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో రూ.కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టగా ఒక్క 2021లోనే సుమారు రూ.100 కోట్ల వరకు దోపిడీదారుల జేబుల్లోకి చేరినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ అధికారే కీలకం!

- దొంగ బిల్లుల పంపకాలపై నాడే ఆరోపణలు
- ఓ రైతు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు
- అస్పష్టత సమాచారం ఇచ్చిన వైనం

సంగం, జనవరి 12 : సంగం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 2021, నవంబరులో వచ్చిన భారీ వరదను ఆసరాగా చేసుకుని ఎఫ్‌డీఆర్ పేరుతో అత్యవసరం కింద మంజూరైన పనుల్లో సదరు సెక్షన్‌లో పని చేసిన ఓ అధికారే కీలకమని విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.కోట్లతో చేపట్టిన ఎఫ్‌డీఆర్ పనులన్నీ రూ.10 లక్షలలోపే విభజించి తనకు సుపరిచితుడైన ఓ కాంట్రాక్టర్‌ను రంగలోకి దింపి నిధులు స్వాహాకు రంగం సిద్ధం చేసుకున్నాడు. ఆ తర్వాత స్థానిక అధికార పార్టీ కీలక నేతలతో కుమ్మక్కై, పనులు చేయకుండానే దొంగ బిల్లులతో భారీ కుంభకోణానికి పాల్పడినట్లు అప్పట్లోనే ఆరోపణలు వినిపించాయి. ఎఫ్‌డీఆర్ భాగంగా అత్యవసర పనుల కింద భారీస్థాయిలో ప్రతిపాదనలు పంపారు. కానీ పనులు ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేవు. పనులు మంజూరయ్యాయా లేదా అనేది కూడా గోప్యంగా ఉంచారు. అయితే ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా మండలంలో పనులు ప్రారంభించినట్లు, చేసినట్లు కనిపించలేదు. కొద్ది నెలల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో అప్పట్లో ఆ అధికారి పలువురు కీలక నేతలకు స్థాయిని బట్టీ రూ.లక్షల్లో పంపకాలు చేసినట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఇంతలో ఆయన బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో అప్పట్లో చేయకుండా మిగిలిపోయిన పనులకు అగ్రిమెంట్ చేసి పనులు చేయకుండానే ఎంబుక్‌లు సిద్ధం చేశారు. చివరి క్షణంలో వెలుగు చూడడంతో నిధుల దోపిడీ ఆగిపోయింది.

ఓ రైతు చొరవ

సంగం సెక్షన్ పరిధిలోని అధికారి హయాంలో జరిగిన పనులకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరుతూ కొరిమెర్ల శ్రీనివాస చౌదరి అనే రైతు 2022 సెప్టెంబరులో సబ్ డివిజన్ అధికారికి దరఖాస్తు చేశారు. సమాచారం ఇవ్వకపోవడంతో ఈఈకి అప్పీలు చేశారు. విషయం తెలుసుకున్న ఆ అధికారి ఓ కీలక నేత ద్వారా రాజీ యత్నాలు చేశారు. దరఖాస్తుదారుడు ససేమిరా అనడంతో గత్యంతరంలేక చివరికి అస్పష్ట సమాచారం అందించారు.

● ఆయన ఎక్కడున్నా..

ఆ అధికారి ఎక్కడ విధులు నిర్వహించినా అంతేనని తోటి అధికారులే గుసగుసలాడుతున్నారు. దొంగ బిల్లులు చేయడం, అటు ఉన్నతాధికారులతోపాటు స్థానిక నేతలను మ్యానేజ్ చేయడం ఆయనకు ఆయనే సాటిగా పేరుంది. ఈయన ఎక్కువ కాలం నెల్లూరు సెక్షన్‌లోనే పనిచేశారు. నెల్లూరులో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరుడిగా పేరు ఉంది. ఆయన సహకారంలో సంగం సెక్షన్‌కు బదిలీ అయ్యారు. పూర్తిస్థాయిలో విచారిస్తే అవినీతి బాగోతం వెలుగులోకి వస్తుంది.

ఎఫ్‌డీఆర్ ముసుగు పనుల్లో లొసుగు

నాడు రూ.230 కోట్లకు అనుమతిచ్చిన కలెక్టర్ ● చాలా చోట్ల పనులు చేయకనే బిల్లులు స్వాహా

సంగం, ఉదయగిరి వ్యవహారాలతో బట్టబయలు ● ఇరిగేషన్ అధికారులు, వైసీపీ నాయకుల కుమ్మక్కు?

ప్రత్యేక సంస్థతో దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగులోకి!

2021 వరద పనుల్లో అవకతవకలు


నెల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : 2020, 2021 సంవత్సరాల్లో జిల్లాలో భారీ వరదలు సంభవించాయి. 2022లో కూడా భారీ వర్షాలు కురవగా, 2023లో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో అతిభారీ వర్షాలు కురిశాయి. సాధారణంగా ఇటువంటి విపత్కర సమయాల్లో అత్యవసరంగా బాగు చేయాల్సిన చెరువులు, కాలువలు, ఇతర నిర్మాణాలకు కలెక్టర్ అనుమతులిస్తే సరిపోతుంది. వీటినే ఎఫ్‌డీఆర్ వర్కులంటారు. సాధారణ వర్కుల మాదిరిగా కాకుండా కేంద్రం సాయం చేస్తుంది కాబట్టి ఎఫ్‌డీఆర్ వర్కులకు త్వరగానే బిల్లులు వచ్చేస్తాయి. అయితే ఈ ఎఫ్‌డీఆర్ ముసుగులో జిల్లాలో భారీ దోపిడీకి తెరలేచింది. 2020లో అప్పటి కలెక్టర్ రూ.25 కోట్లకు మాత్రమే ఎఫ్‌డీఆర్ కింద పనులకు అనుమతులిచ్చారు. కానీ 2021లో ఏకంగా రూ.230 కోట్ల పనులు మంజూరు చేశారు. సాధారణ వర్కులకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, ఒకవేళ వచ్చి పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో అధికార పార్టీ నేతలు, ఇరిగేషన్ అధికారులకు పర్సంటేజీలు కరువయ్యాయి. దీంతో ఎప్పుడూ లేనంతగా ఎఫ్‌డీఆర్ కింద వర్కులను ప్రతిపాదించారు. ఒక వర్కు వరదల కారణంగా దెబ్బతినకపోయినా అది డ్యామేజీ అయినట్లు చూపించి ఎఫ్‌డీఆర్ కింద ప్రతిపాదించినట్లు మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. ఇలా వేల వర్కులను ప్రతిపాదించగా చాలా వర్కులను చేయకుండానే బిల్లులు పెట్టేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ వచ్చాయి. ఎఫ్‌డీఆర్ కింద ఏ ఏ పనులు చేశారో ఆ వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద అడిగినా ఇవ్వలేదని తెలుగుదేశం పార్టీ నేతలు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా చేశారు. అయినా అధికారులు పూర్తి స్థాయి వివరాలు ఇవ్వకపోవడం ఆరోపణలకు మరింత బలం చేకూరింది.

● రెండేళ్లుగా పనులకు బ్రేక్

2022లో కూడా రూ.153 కోట్లతో ఎఫ్‌డీఆర్ కింద పనులను ప్రతిపాదించారు. అయితే కలెక్టర్ ఈ ప్రతిపాదనలకు బ్రేకులు వేశారు. అంతకు ముందు సంవత్సరం రికార్డు స్థాయిలో తన చేత వర్కులు మంజూరు చేయించారని గ్రహించిన కలెక్టర్, ఆ పనులపై వచ్చిన ఆరోపణలను దృష్టిలో పెట్టుకొని ఈ దఫా ఎఫ్‌డీఆర్ పనులకు అనుమతులిచ్చేందుకు నిరాకరించారు. ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకురావడంతో ఆర్డీవోలు, మండల ప్రత్యేకాధికారులతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించిన వర్కులను పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చారు. వీరు ఇచ్చిన నివేదిక ప్రకారం ఎఫ్‌డీఆర్ కింద అనుమతులు ఇస్తానని స్పష్టం చేశారు. కానీ ఆర్డీవోలు, ప్రత్యేకాధికారుల పరిశీలనలో చాలా వర్కులు వరదలకు దెబ్బతినలేదని నాటి కలెక్టర్‌కు అంతర్గతంగా తెలియజేయడంతో 2022లో రూపాయి కూడా ఎఫ్‌డీఆర్ కింద మంజూరు చేయలేదు. అలానే 2023లో కూడా సుమారు రూ.60 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌డీఆర్ ప్రతిపాదనలు పంపారు. కానీ గత అనుభవాల దృష్ట్యా ప్రస్తుత కలెక్టర్ కూడా ఆ స్థాయిలో అనుమతులిచ్చేందుకు సాహసించలేదు. కేవలం రూ.5 కోట్లకు మాత్రమే అనుమతులిచ్చి, ఆ పనులను కూడా ఎప్పటికప్పుడు ఫొటోలతో సహా తనకు నివేదిక రూపంలో అందించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. దీంతో ఈ ఏడాది కూడా ఎఫ్‌డీఆర్ దోపిడీకు బ్రేక్ పడింది. కాగా 2021లో జరిగిన ఎఫ్‌డీఆర్ పనులపై విజిలెన్స్ వంటి ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



2021, నవంబరులో వరద పోటెత్తడంతో సోమశిల డ్యాం వద్ద దెబ్బతిన్న రోడ్డు (ఫైల్)



కమనీయం గోదా కల్యాణం



కల్యాణ వేదికపై చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి, గోదాదేవి

నెల్లూరు రూరల్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వేదగిరి క్షేత్రంలో శుక్రవారం గోదాదేవి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేతంగా నరసింహ స్వామిని, గోదాదేవిని అర్చకులు ప్రత్యేకం అలంకరించి మంగళవాద్యాలతో తోడ్కొని వచ్చి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా గోదా కల్యాణం జరిపారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

● పెంచలకోనలో క్షేత్రోత్సవం

రాపూరు (డక్కిలి) : పెంచలకోనలోని నృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవికి విశేష పూజలు జరిగాయి. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి క్షేత్రోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా, ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఉదయం 9 గంటలకు గోదాదేవి క్షేత్రోత్సవం, 11 గంటలకు కల్యాణం జరుగుతుందని ఆలయ కమిషనర్ జానర్దన్ రెడ్డి చెప్పారు. 15న సంక్రాంతి సందర్భంగా స్వామి అమ్మవార్లతోపాటు ఆంజనేయస్వామికి అభిషేకం, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ, ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ జరగనుంది. రాత్రి 7 గంటలకు గోనుపల్లి గ్రామోత్సవం జరగనుంది.



చింతలపాళెంలో గుట్టగా వదిలేసిన రాళ్లు

'హద్దు' చూపని రాళ్లు!

జగన్ సర్కార్ ఎంతో గొప్పగా చేపట్టిన భూముల రీసర్వే క్షేత్రస్థాయిలో లోపభూయిష్టంగా మారింది. భూ సమస్యలు, తగాదాలు పరిష్కరించడంతోపాటు భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా కోట్లాది రూపాయిలు వెచ్చించి ఈ సర్వే చేపట్టింది. డ్రోన్ల సాయంతో ఆధునిక టెక్నాలజీ ద్వారా సర్వే పూర్తి చేసిన భూములకు హద్దులు నిర్ణయిస్తూ సర్వే రాళ్లు పాతాల్సి ఉంది. అయితే కలువాయి మండలంలో హద్దు రాళ్ల వేసే ప్రక్రియ తూతూమంత్రంగా సాగుతోంది. మాదన్నగారిపల్లెలో సర్వే చేసిన భూముల్లో కాకుండా దార్లు, డొంకల్లో మాత్రమే దగ్గర దగ్గర సర్వే రాళ్లు వేస్తున్నారు. ఇది చూసిన రైతులు విస్తుపోతున్నారు. దార్లు, డొంకల్లోనైనా సర్వే చేసి రాళ్లు వేయలేదని మూసుకుపోయిన దార్లలో అలాగే రాళ్లు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి మాదన్నగుంటకు వెళ్లే దారి, ఎస్సీ కాలనీ నుంచి అడవికి వెళ్లే రెండు దార్లలో మాత్రం దగ్గర దగ్గర సర్వే రాళ్లు వేశారు. భూముల్లో ఎక్కడా సర్వే రాళ్లు వేయలేదని రైతులు వాపోతున్నారు. చింతలపాళెంలో సర్వే పూర్తయిన భూముల్లో అక్కడక్కడ హద్దు రాళ్లు వేసి మిగిలిన చోట వదిలేశారు. ఇక్కడా దార్లు, డొంకల్లో మాత్రం దగ్గర దగ్గర సర్వే రాళ్లు వేశారు. ఇందుకోసం తెచ్చిన హద్దు రాళ్లు గ్రామంలోని పలు చోట్ల గుట్టలుగా వేసి ఉన్నారు. ఇలా కోట్లాది రూపాయిలు వెచ్చించి సర్వే రాళ్లు తీసుకువచ్చి భూముల్లో వేయకుండా పడేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

- కలువాయి



మాదన్నగారిపల్లెలో దారి వెంబడి వేసిన సర్వే రాళ్లు

జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

● ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు (క్రైం), జనవరి 12 : సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె తిరుమలేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించవద్దని, కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తమ ప్రత్యేక బృందాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా జూదం ఆడుతున్న తెలిస్తే 112కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



ఉత్తమ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా ఉదయ్‌శంకర్

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్ శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర ఉత్తమ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అవార్డును అందుకున్నారు. 2022 - 23లో ఎన్ఎస్ఎస్ విభాగంలో అల్లం ఉదయ్ శంకర్ ఉత్తమ సేవలు అందించడంతో అవార్డుకు ఎంపికయ్యారు. ఐఏఎస్ కమిషనర్ పీ భాస్కర్, ఉన్నత విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ వెంకటపతిరావు, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పీ అశోక్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా వర్సిటీ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి అభినందించారు. అలాగే రాష్ట్ర ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కేటగిరీలో కావలిలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ప్రోగ్రామ్ అధికారి వెంకటసాయి తేజ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ కేటగిరీలో గూడూరులోని ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న పల్లపు ప్రియ, యూనివర్సిటీ కళాశాలలో ఎంఎస్సీ చదువుతున్న ఎం పృథ్వీరాజు కూడా అవార్డులు అందుకున్నారు.

అంబేడ్కర్ సేవలను తెలుసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 12 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతికి చేసిన సేవల గురించి భావితరాల వారు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జన్‌భాగీదారి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు మానవహారం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 19న విజయవాడలో న్యాయ మహా శిల్పం ఆవిష్కరిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.





వీఆర్సీ సెంటర్ వద్ద మానవహారంలో జడ్పీ చైర్‌పర్సన్, జేసీ తదితరులు

ఇన్ని గుంతలున్నా గంతలు విప్పరేం!

- కావలి కేంద్రంగా గ్రావెల్ అక్రమ రవాణా
- బరితెగిస్తున్న అధికార పార్టీ నేతలు
- ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్న యంత్రాంగం

కావలి, జనవరి 12 : గ్రావెల్ మాఫియాకు కావలి అడ్డాగా మారింది. చెరువులు, ప్రభుత్వ భూములు ఇలా ఖాళీ స్థలం కనిపిస్తే చాలా తెల్లారేసరికి భారీ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు చేరిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు తవ్వకాలు జరిపి విలువైన ప్రకృతి సంపదను కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. తెరవెనుక అధికార పార్టీ నేతలు ఉండటంతో ఈ గ్రావెల్ దోపిడీని అడ్డుకునేందుకు అధికారులు జంకుతున్నారు. కావలి పెద్ద చెరువులో వారం రోజులుగా రాత్రిపూట యంత్రాలతో గ్రావెల్‌ను తవ్వి తరలిస్తుండటంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. అలాగే బోగోలు మండలం నుంచి ప్రభుత్వ భూములలో గ్రావెల్ తవ్వి నెల్లూరుకు తరలిస్తున్నారు. కావలి ప్రాంతంలో యథేచ్ఛగా జరుగుతున్న ఈ గ్రావెల్ దోపిడీపై ప్రతిపక్షాలు, పత్రికలు, మీడియా ఘోషిస్తున్నా అధికారుల్లో చలనం ఉండటం లేదు. దీని వెనుక పెద్ద తతంగమే నడుస్తోందన్న వాదన వినిపిస్తోంది. మైనింగ్, రెవెన్యూ ఇతర శాఖలకు చెందిన కొంతమంది అధికారులకు నెల మామూళ్లు అందుతుండటంతో వారు పట్టించుకోవడం లేదు. మరికొంతమంది అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేందుకు పూనుకున్నా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్నారు.



జామాయిల్ చెట్ల వద్ద ఎక్స్‌కవేటర్

● కావలి చెరువులో భారీ గుంతలు

గతంలో కావలి చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థులు అక్రమార్కులు తవ్విన గుంతల్లో చిక్కుకుని 8 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో చెరువులలో భారీ గోతులు తీసి గ్రావెల్ తరలించకూడదని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నా కావలిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం కావలి పెద్ద చెరువుపై భాగాన రెండు ఎస్సీ కాలనీల మధ్యలో కావలికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఒక్కో టిప్పరు లోగు గ్రావెల్‌ను రూ.8వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ బావులను తలపించే విధంగా గుంతలు ఉండటంతో గత అనుభవాల దృష్ట్యా స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున ఆ తర్వాత తమ అక్రమాలు సాగవని గ్రహించిన నాయకులు ఈలోపే దొరికినకాడికి దోచుకునేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.





కావలి చెరువులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శం



కావలిటౌన్ : వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



సంగం: స్వామి వివేకానందకు నివాళులు అర్పిస్తున్న యువకులు



దుత్తలూరులో రక్తదానం చేస్తున్న యువత

కావలిటౌన్, జనవరి 12: స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షతన ట్రంకురోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బ్రహ్మానందం మాట్లాడుతూ వివేకానంద జయంతి నాడు జాతీయ యువజన దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. యువతకు వివేకానంద సూక్తులు మార్గదర్శకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు జీ.భరత్‌కుమార్, కిసాన్‌మోర్చా రాష్ట్రకార్యదర్శి కంచర్ల మురళీనాయుడు, నారా మాలకొండానాయుడు, బచ్చు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్ రక్తనిధి భవన్‌లో రెడ్‌క్రాస్ కావలి శాఖ ఛైర్మన్ రవిప్రకాష్ అధ్యక్షతన వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామిశెట్టి సుధీర్‌నాయుడు, డాక్టర్ బెజవాడ రవికుమార్, వీసీయు ప్రొఫెసర్ సుశీల, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ హనుమకుమార్, గంధం ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : స్వామి వివేకానంద జీవనం యువతకు ఆదర్శనీయమని బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీసీ నరసింహారెడ్డి, కె.వెంకట్రామిరెడ్డి, రామ్మోహన్, శ్రీనివాస్, మాల్యాద్రి, యువకుకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగం : మండలంలోని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అదేవిధంగా సంగంలోని స్వామి వివేకానంద సెంటర్‌లో యువత ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఉదయగిరి రూరల్ : స్థానిక పాత స్టేట్‌బ్యాంక్ ఆవరణలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మాధవరెడ్డి, భూపతిరాజా, నారాయణరెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విశ్వభారతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నర్రావుల పుల్లారెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైద్యాధికారి అయూబ్ ప్రారంభించి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ మోటివేటర్ భాస్కరరావు, టెక్నికల్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సభ్యులు రామయ్య, సురేష్, కృష్ణ, రాజా, శ్రీకాంత్, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని అంగన్వాడీల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని ధర్నాలో పాల్గొన్న అంగన్వాడీలు

కావలిటౌన్: అంగన్వాడీల చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం 32వ రోజు కళ్లకు నల్లరిబ్బనుతో గంతలు, ఎర్ర చీరలు కట్టుకుని అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పీ.పెంచలయ్య, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలతలు మాట్లాడుతూ చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం సమంజసం కాదని, సమస్యలు పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు మాల్యాద్రి, నరహరి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

● **అంగన్‌వాడీలకు యూటీఎఫ్ ఆర్థిక చేయూత**

ఆత్మకూరు, జనవరి 12: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్య కర్తలు, హెల్పర్లు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీ డీఎస్ ప్రాజెక్ట్ కార్యాల యం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. యూటీఎఫ్ నాయకులు శిబి రానికి విచ్చేసి తమ వంతు సహకారంగా రూ. 10వేలు అందజేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు యూటిఎఫ్ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

కావలిటౌన్, జనవరి 12: పట్టణంలోని 18వ వార్డు వెంగళరావునగర్‌లో శానం కృష్ణ దివ్యప్రణీత దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ముఖ్య అతిథిగా పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సుధాకర్ సతీమణి సుగుణమ్మ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి ముస్లిం మహిళ షేక్ షబానాకు దక్కింది. వార్డులో రోడ్లు, డ్రైన్లు అవసరమైన చెప్పాలని ట్రస్ట్ ద్వారా నిర్మించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ చీరలు, స్టీల్ బాక్సులు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు.

కలువాయి : మండలంలోని కుల్లూరు పంచాయతీ పరిధిలోని కుల్లూరు, వెంకటరెడ్డిపల్లి, రాజుపాళెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతుల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన వారికి శుక్రవారం జాయింట్ కలెక్టర్ రోణంకి కుర్మానాథ్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

అనంతసాగరం : మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. అనంతసాగరంలో అన్ని ఆలయాలతో పాటు ప్రధాన వీధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి అలంకరించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతసాగరం, జనవరి 12: స్థానిక క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. అనంతసాగరం ఏఎస్ఐ మస్తాన్ పాల్గొని స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, వేము పెంచలయ్య, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: క్రీడలు మానసికోల్లాశానికి దోహద పడతాయని ఎస్ఐ బాలమహేంద్రచ నాయక్ తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో 10వ వార్డు సభ్యులు ఎండ్లూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎస్ఐ ప్రారంభించారు.

ప్రియాంక జన్మదిన వేడుకలు

ఉదయగిరి రూరల్, జనవరి 12: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దుద్దుకూరు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్ బాలయ్య, నాయకులు కానాల హజరత్, రమణయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గిరిజన పిల్లలకు దుస్తుల పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 12: సంక్రాంతి సందర్భంగా మండలంలోని నర్రవాడ గ్రామంలో వెంగమాంబ గిరిజన కాలనీ పిల్లలకు రాష్ట్ర వినియోగదారుల ఫోరం నియోజకవర్గం అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, పామూరు సేవాభారతి ప్రతినిధి పాబోలు శివ వితరణ చేసిన దుస్తులను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కదిరి రంగారావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌మోహన్, నూతలపాటి జయలక్ష్మి, చుండి హరిగోపాల్‌రెడ్డి, కిశోర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

14న ఆత్మీయ సమావేశం

వరికుంటపాడు, జనవరి 12: స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో ఈనెల 14న దివంగత మాజీ మంత్రి మాదాల. జానకిరామ్ అనుచరుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. కావున ఆయన అభిమానులు, అనుచరులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఈశ్వరీ భూషణంకు ఉత్తమ కవయిత్రి పురస్కారం

కందుకూరు, జనవరి 12: కందుకూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, మట్టిపాదం పుస్తక రచయిత, కవయిత్రి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జీ.ఈశ్వరీభూషణంకు రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ ఉత్తమ కవయిత్రి పురస్కారం అందజేసింది. ఏలూరులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సవాలలో జిల్లా కలెక్టరు వై.ప్రసన్న వెంకటేష్, సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టరు లావణ్యవేణిల చేతలమీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ పురస్కారంతో పాటు రూ.5వేల బహుమతి, మెమొంటోను అందజేసి దుశ్శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. ఆమెకు పురస్కారం దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

19, 20 తేదీల్లో అంగన్‌వాడీల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఉదయగిరి, జనవరి 12: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో లావణ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19న ఆత్మకూరు ఆర్డీవో, 20న కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలని ఆమె కోరారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, జనవరి 12: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు పీజీటీ జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 8712625047 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలువాయి, జనవరి 12 : మండలంలోని కలువాయి, చింతలాత్మకూరు, కుల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

జగన్‌ను కలిసిన బొట్ల రామారావు



కందుకూరు, జనవరి 12: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా ఆపార్టీ అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్న టంగుటూరు మండలం కందులూరు గ్రామానికి చెందిన బొట్ల రామారావు అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రకాశం జిల్లా గొర్రెలపెంపకందారుల సహకార సంఘం యూనియన్ ఛైర్మన్‌గా ఉన్న బొట్ల రామారావు శుక్రవారం సీఎం జగన్మోహనరెడ్డిని కలిశారు. ఈయన గత కొన్నేళ్లుగా వైసీపీలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. అధిష్ఠానం పిలుపు మేరకే బొట్ల రామారావు వెళ్లి కలవడం జరిగిందని, ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ పరిస్థితులపై వారి మధ్య చర్చ జరిగిందని చెబుతున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో అపశ్రుతి

కబడ్డీ ఆడుతూ యువకుడికి గాయాలు

కలువాయి : కలువాయిలోని విశ్వం పాఠశాల మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. చిన్నగోపవరం- బ్రాహ్మణపల్లి గ్రామాల జట్ల మధ్య పోటీ జరుగుతుండగా బ్రాహ్మణపల్లి జట్టుకు చెందిన గౌరీశంకర్‌ను క్రీడాకారులు పట్టుకుని అందరూ అతనిపై పడటంతో మోకాలిచిప్ప పక్కకు తొలగింది. దీంతో ఆ యువకుడుని స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించి మోకలి చిప్పను సరిచేసి చికిత్స అందించారు. గాయపడిన యువకుడిని ఎంపీడీవో గోవర్ధన్ పరామర్శించారు. కాగా, శుక్రవారం సాయంత్రం కలువాయిలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలను జాయింట్ కలెక్టర్ రోణంకి కుర్మానాథ్ పరిశీలించారు. తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీవో గోవర్ధన్ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అల్లూరు : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, సచివాలయ ఉద్యోగులు

వరికుంటపాడు, జనవరి 12: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీఎం వైనా రూత్, సర్పంచ్ దిలీప్ కుమార్ అన్నారు. శుక్ర వారం జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని విగ్రహం ఎదుట జాతీయ రహదారిపై వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ నెల 19వ తేదీన 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ప్రభుత్వం ఆవిష్కరించనున్న నేపథ్యంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

అల్లూరు : విజయవాడలో ఈనెల 19న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో జన్ భగీదార కార్యక్రమాన్ని పురస్కరిచుకుని అల్లూరు పాతబస్టాండు కూడలిలో శుక్రవారం అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. సచివాలయం-1 కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు నీలం సాయికుమార్, ఉస్మాన్‌షరీఫ్, జంషీర్, కరుణాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

ఆత్మకూరు, జనవరి 12 : శ్రీకృష్ణ సేవా సమితి, యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సౌజన్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని శ్రీకృష్ణ మందిరం దగ్గర ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు

ఇందిరా క్రాంతి పథం సిబ్బంది నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఇందిరా క్రాంతి పథం సిబ్బంది

కావలి రూరల్, జనవరి 12: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ కావలి వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఇందిరా క్రాంతి పథం సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఆ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. ఈపీఎఫ్ అమలు, కారుణ్య నియామకాలు చెపట్టాలన్నారు. సెర్ప్ సిబ్బంది పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. సమస్యల సాధన కోసం ఈ నెల 10వ తేదీన ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని, 22వ తేదీ వరకు నిరసన తెలుపుతామని, సమస్యలు పరిష్కరించని పక్షంలో 23వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు రాష్ట్ర జేఏసీ పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ ఛైర్మన్ పీ.రవికుమార్, ఏపీఎం కాంతారావు, సీసీలు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా : వేమిరెడ్డి



ఉదయగిరిలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి

ఉదయగిరి, జనవరి 12: రాబోవు ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా తనను ప్రజలు ఆశీర్వదిస్తే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌ను చేయాలని కోరారు. అంతకుముందు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు షేక్ యస్థానీ, జాఫర్‌మొహిద్దీన్‌ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు నాయకులు చిరంజీవిరెడ్డి, కొడవలూరి ధనుంజయరెడ్డి, గురవారెడ్డి, తాజుద్దీన్, వెంకటేశ్వరరెడ్డి, గానుగపెంట ఓబులరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, అలీఅహ్మద్, ఉప్పుటూరి శ్రీనివాసులు, సురేష్, రాపల్లి తిరుపతి, బాషా తదితరులు పాల్గొన్నారు.

● **శుద్ధిజల కేంద్రం ప్రారంభం**

ఉదయగిరి రూరల్ : కుర్రపలిలో వీపీఆర్ అమృతధార శుద్ధిజల కేంద్రాన్ని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం గ్రామస్తుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అలాగే గండిపాళెంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్యలు వేమిరెడ్డి, మేకపాటిలకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జీ.ఓబులరెడ్డి, సర్పంచ్‌లు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరులో: దుత్తలూరులో వైఎస్ఆర్ ధ్యాన మందిరాన్ని మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంల దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కొడవలూరి ధనుంజయరెడ్డి, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : మండలంలోని నల్లబోతులవారిపల్లి గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వీపీఆర్ అమృతధార తాగునీటి పథకాన్ని శుక్రవారం రాజ్యసభ సభ్యులు మేమిరెడ్డి. ప్రభాకర్ సమక్షంలో సర్పంచ్ రమణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ మెట్టుకూరి. చిరంజీవిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంగం : లబ్ధిదారులకు ఉజ్వల గ్యాస్ సిలిండర్, స్టౌ అందచేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

కొండాపురం, జనవరి 12: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని పలు శాఖల అధికారులు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని సాయిపేట, భీమవరప్పాడు గ్రామాల్లో అధికారులు వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యం, తాగునీరు, ఉపాధి హామీ, వెలుగు, విద్య, ఉజ్వల తదితర కేంద్ర పథకాలను గురించి అధికారులు ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ శ్రీనివాసులు, ఎంఈవో-2 ఆనందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీ బాషా, ఏపీఎం మనోహర్, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, ఏపీవో చెంచయ్య, ప్రదీప్, బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సంగం : అన్నారెడ్డిపాళెంలో శుక్రవారం ఉజ్వల పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ గిరిజన మోర్చ నాయకుడు పోట్లూరి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి బాణా శ్రీనివాసులురెడ్డి, ఏజెన్సీ నిర్వాహకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులను పరామర్శ

కావలి రూరల్, జనవరి 12: ప్రమాదంలో గాయపడి నెల్లూరు అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్న కావలి పట్టణం గాయత్రీనగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు చీకుర్తి వినోద్, బూచి రమణయ్యలను శుక్రవారం కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారి వెంట బోగోలు మండలం టీడీపీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు గుండ్లపల్లి శివాజీ, రమణయ్య, కిషోర్, శ్రీనివాసులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

కావలిలో తమిళనాడు ఓటర్లు

కావలిటౌన్, జనవరి 12: కావలి ఓటర్ల జాబితాలో తమిళనాడుకు చెందిన వారు ఓటర్లుగా నమోదైనట్లు టీడీపీ జిల్లా కార్యదర్శి యేగూరి చంద్రశేఖర్ శుక్రవారం ఆర్డీవో శీనానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 18వ వార్డు ఓటర్ల జాబితాలో వైసీపీకి చెందిన నాయకులు తమిళనాడుకు చెందిన ఓటర్లను నమోదు చేసి ఉన్నారని, వెంటనే విచారించి ఆ ఓట్లను తొలగించి దొంగఓట్లు నమోదుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

చెక్క రిక్షా చోరీ

కావలి రూరల్ : వైకుంఠపురానికి చెందిన నిరుపేద వృద్ధుడు కరాల వెంకటేశ్వర్లుకు చెందిన చెక్క రిక్షా గురువారం రాత్రి అపహరించుకెళ్లారు. బాధితుడి వివరాల మేరకు.. గురువారం రాత్రి పట్టణంలోని కోర్టు వీధిలోని ఓ కల్యాణ మండపం వద్ద రిక్షాను ఉంచి బంధువుల శుభకార్యానికి వెళ్లి భోజనం చేసి వచ్చే సరికి చెక్క రిక్షా అపహరించుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు శుక్రవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.